## నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలి

**- ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలు**



**నెల్లూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 9,ప్రభాతవార్త** ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన మంత్రులు, కార్యదర్శుల సమావేశానికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ స్వాగతం పలికారు. వర్చువల్ పద్ధతిలో, కలెక్టర్ కార్యాలయంలోని శంకరన్ హాల్లో సాగిన ఈ సమావేశానికి నెల్లూరు జిల్లా నుంచి ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



**ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ** ఇది మూడవ మంత్రులు కార్యదర్శుల సమావేశమని ప్రతినెల ఈసమావేశాన్ని నిర్వహిస్తుండగా జిల్లా, డివిజన్, మండలం, స్వర్ణ గ్రామ, వార్డు అధికారులు వర్చువల్‌గా ఈ సమావేశంలో పాల్గొంటున్నారని తెలిపారు. అలాగే ప్రతి మూడు నెలలకు ఒకసారి జిల్లా కలెక్టర్ల సమావేశం నిర్వహిస్తున్నామని చెప్పారు. ఏడాదికి సంబంధించిన లక్ష్యాల సాధనకు నెలవారీ లక్ష్యంల ప్రగతిని ద్వారా సమీక్షించుకుని లక్ష్యాలను సాధించాలన్నారు. అంతేగాక రాష్ట్ర, కేంద్ర పథకాలు జిల్లా స్థాయిలో పటిష్ట అమలు, లక్ష్యాల సాధనపై సమీక్షించుకోవాలి జరుగుతుందని సిఎస్ విజయానంద్ పేర్కొన్నారు. అంతేగాక జిఎస్డిపి, ఆర్టీజిఎస్, స్పీడ్ ఆఫ్ డూయింగ్ గవర్నెన్స్ అంశాలపైన చివరగా రాష్ట్రంలో శాంతి భద్రతలపై సమీక్షించడం జరుగుతుందని సిఎస్ పేర్కొన్నారు.

## వెట్టి చాకిరి వ్యతిరేక ప్రకటన పోస్టర్ విడుదల



**నెల్లూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త** నెల్లూరు జిల్లా కలెక్టర్ హిమన్షు శుక్ల, జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ అజిత వేజెండ్ల సంయుక్తంగా వెట్టి చాకిరి వ్యతిరేక ప్రకటన పత్రాన్ని విడుదల చేశారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని ఎస్ ఆర్ సెంకరణ్ హాల్‌లో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఉప కార్మిక కమిషనర్, నెల్లూరు సిహెచ్ విజయ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

## ఎస్పీకి వినతుల వెల్లువ



**నెల్లూరు క్రైమ్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త :** జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమంలో 146 ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజా ఫిర్యాదుల పట్ల అలసత్వం ఉండరాదని, ప్రజలతో జవాబు దారీగా వ్యవహరించి పిటీషన్లను పరిష్కరించాలని ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల అధికారులను ఆదేశించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించి, చట్టపరిధిలో పరిష్కారం చూపాలని పోలీసు అధికారులను ఆదేశించారు. నెల్లూరు రూరల్ పరిధికి చెందిన మహిళ, తన కొడుకుకు ఇన్స్టాగ్రామ్ ద్వారా చక్రధర్ రెడ్డి అనే వ్యక్తి పరిచయమై, తర్వాత తీయబోయే సినిమాలో హీరో పక్కన తమ్ముడి క్యారెక్టర్ ఇప్పిస్తానని నమ్మించి రూ. 1,06,000 నగదు తీసుకొని, ఎటువంటి సినిమాలో ఛాన్స్ ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని, మోసపోయానని, విచారించి న్యాయం చేయాలని కోరారు. కోటకి చెందిన వ్యక్తిని, హైదరాబాద్‌కు చెందిన కూటికొండ రామకృష్ణ అనే వ్యక్తి, దుబాయ్‌కి పంపి ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి, తన వద్ద రూ. 4,50,000 నగదు తీసుకొని, దుబాయ్‌కి విజిట్ వీసా కింద పంపించి, అక్కడ ఉద్యోగం కూడా లేదని, వీసా గడువు అయిపోయిందని చెప్పి తిరిగి ఇంటికి వచ్చేసానని, మోసపోయానని, విచారించి న్యాయం చేయాలని కోరారు. విడవలూరుకి చెందిన మహిళ కుమారుడు గత అక్టోబర్ నెల నుండి కనిపించడం లేదని, విడవలూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారని, లోతుగా దర్యాప్తు చేసి తన కుమారుని ఆచూకీ కనుగొని అప్పగించాలని కోరారు. పరిష్కార వేదికకి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఎస్పీ హామీ ఇచ్చారు. అడిషనల్ యస్.పి.(అడ్మిన్) సిహెచ్. సౌజన్య, టౌన్ డిఎస్పి దీక్ష, రూరల్ డిఎస్పి ఘట్టమనేని శ్రీనివాసరావు, ఎస్బి డిఎస్పీ శ్రీనివాసరావు, లీగల్ అడ్వైజర్ శ్రీనివాసులు రెడ్డి, పిసిఆర్ సిఐ భక్తవత్సల రెడ్డి, మహిళా స్టేషన్ సిఐ సుబ్బారావు, ఎస్‌బి 2 సిఐ శ్రీనివాస రెడ్డి, కంప్లైంట్ సెల్ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యుత్ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి



**నెల్లూరు, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త -వైద్యం** నెల్లూరులోని విద్యుత్ భవన్ నందు నిర్వహించిన డయల్ యువర్ ఎస్ఈ కార్యక్రమానికి జిల్లాలోని అన్ని డివిజన్ల నుండి మొత్తం 6 ఫిర్యాదులు అందినట్లు జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్ కే.రాఘవేంద్రం తెలిపారు. విద్యుత్ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు చెప్పారు. ఈ ఫిర్యాదులు ముఖ్యంగా రీడింగ్ సమస్య, లో ఓల్టేజి సమస్యలు, వ్యవసాయ నూతన సర్వీసులు, గృహ విద్యుత్ సర్వీసులకు టైటిల్ ట్రాన్స్ ఫర్ తదితర అంశాలకు సంబందించినవిగా ఉన్నాయని తెలిపారు. అందిన ప్రతి ఫిర్యాదును చాలా సీరియస్‌గా తీసుకుంటున్నామని, వాటిని సంబంధిత అసిస్టెంట్ ఇంజనీర్లకు వెంటనే తెలియజేసి, రెక్టిఫికేషన్ పూర్తి చేసిన అనంతరం తిరిగి ఫొటోతో సహా నివేదిక పంపించాలని ఆదేశించామని తెలిపారు. వినియోగదారుల సమస్యలను వేగంగా పరిష్కరించాలనే లక్ష్యంతో ప్రతి సోమవారం ఈ డయల్ యువర్ ఎస్ఈ కార్యక్రమం నిర్వహించబడుతుందని, వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్(టెక్నికల్) ఎస్ బాలచంద్ర, ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ టౌన్ శ్రీధర్, డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ మునీంద్ర, అసిస్టెంట్ ఇంజనీర్లు తిరుపతయ్య, నరసింహారావు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

## ఆర్టీసి బస్టాండులో ప్రయాణీకుల వసతులకు కృషి



**కావలి, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :** కావలి ఏపిఎస్ ఆర్టీసి బస్టాండులో ప్రయాణీకులకు అవసరమైన అన్ని వసతులు మెరుగు పరిచేందుకు కృషి చేస్తున్నట్లు డిపో మేనేజర్ డి.ఆదినారాయణ తెలిపారు. బస్టాండులోని అన్ని షాపుల నిర్వాహకులకు ఆర్టీసి జోనల్ ఛైర్మెన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి సమకూర్చిన చెత్తకుండీలను పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారికి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం డిఎం ఆదినారాయణ మాట్లాడుతూ డిపో మేనేజర్‌గా బాధ్యతలు చేపట్టిన తరువాత ప్రయాణకులు వసతులు మెరుగు పరచడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. గ్యారేజీ ఆవరణలో గుంతలను పూడ్చిపించామని, కార్మికులు పనిచేసేందేకు ఏర్పాటు చేశామని తెలిపారు. మరుగుదొడ్లు ఆదునీకరించడానికి ప్రణాళికలను సిద్ధం చేశామని తెలిపారు. ప్రయణీకు కోసం ఆర్‌ఓప్లాంట్లు ఏర్పాటు, గార్డెన్ ఏర్పాటువంటి సౌకర్యాల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. అన్ని వసతుల కల్పన పూర్తి అయితే బస్టాండు రూపురేఖలు మారుతాయన్నారు. మంచి వాతావరణం కోసం కార్మికులు, బస్టాండులోని దుకాణదారులు, సిబ్బంది సహకరించాలన్నారు. అసిస్టెంట్ మేనేజర్ ఎం.కల్పన, సూపరిండెంట్ ఎం.రామక్రిష్ణ, అసిస్టెంట్ ఇంజనీర్ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

## సీఎం చంద్రబాబుకు స్వాగతం పలికిన ఎంపి వేమిరెడ్డి



**నెల్లూరు, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త -వైద్యం** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధిలో భాగంగా పలువురు కేంద్ర మంత్రులతో భేటీ అయ్యేందుకు ఢిల్లీకి చేరుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి స్వాగతం పలికారు. సోమవారం సాయంత్రం ఢిల్లీలోని ఇందిరా గాంధీ విమానాశ్రయానికి చేరుకోగా.. నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆయనకు ఆహ్వానం పలికారు. సీఎం చంద్రబాబు కేంద్ర హోం మంత్రి అమిత్ షా, ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్, రైల్వే మినిస్టర్ అశ్వినీ వైష్ణవ్, కేంద్ర జల్ శక్తి మంత్రి సి.ఆర్. పాటిల్, కేంద్ర వ్యవసాయ శాఖా మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, ఇతర మంత్రులతో భేటీ కానున్నారు. రాష్ట్రాభివృది, నిధులు, పెండింగ్ అంశాలపై వారితో చర్చించనున్నారు.



శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త

## సోమశిల నీటిమట్టం



**అనంతసాగరం, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త :** మండలంలోని సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి సోమవారం సాయంత్రానికి 3514 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం నమోదైంది. జలాశయం పూర్తిసామర్థ్యం 78 టిఎంసిలు కాగా ప్రస్తుతం జలాశయం లో 69.834టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఎస్‌ఎఫ్‌సికి 200, ఎస్‌ఎఫ్‌సికి 300, పెన్నా డెల్టా 1400, కండలేరు వరద కాలువకు 2000 క్యూసెక్కులు, పెన్నా నదికి 1400క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 99.462 మీటర్ల మేర నీటిమట్టం నమోదైందని జలాశయం అధికారులు తెలిపారు.

## నారాయణ హాస్పిటల్లో మూర్ఛ రోగుల కొరకు టోల్ ఫ్రీ నంబర్ ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్





**నెల్లూరు, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త-వైద్యం** అంతర్జాతీయ ఎపిలెప్సి డే సందర్భంగా నారాయణ హాస్పిటల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా విచ్చేశారు. ఎపిలెప్సి డే సందర్భంగా వైద్య విద్యార్థులను కలుసుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. వైద్య విద్యార్థులకు ఎపిలెప్సి గురించి తెలిసే ఉంటుందని, అయితే సమాజంలోని ప్రతి ఒక్కరికి దీని గురించి అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, సమాజంలో మానవత్వం అనేది తగ్గుతుందని, కుటుంబంలో సమస్య వస్తే ఎలా స్పందిస్తామో అలాగే సమాజంలో కూడా సమస్య వచ్చినప్పుడు ప్రతి ఒక్కరూ స్పందించాలన్నారు. అనంతరం నారాయణ హాస్పిటల్ వారు ఎపిలెప్సీ రోగుల కొరకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబర్ 1800-424-0060 పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం నారాయణ మెడికల్ కాలేజీ డీన్ డాక్టర్ పి.శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఫిబ్రవరి నెల రెండవ సోమవారాన్ని ఎపిలెప్సిడే గా జరుపుకుంటారని, భారతదేశ జనాభాలో 10-12 మిలియన్ల మంది ఎపిలెప్సితో బాదపడుతున్నారని, దీనిని నివారించేందుకు ఈ రోజు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ప్రత్యేకటోల్ ఫ్రీ నంబర్‌ను ఆవిష్కరించడం జరిగిందని, ఈ నంబర్ ఈ రోజు నుండి ప్రజలకు అందుబాటులో ఉంటుందని, ఎపిలెప్సి గురించి ఎటువంటి అపోహలు ఉన్నా, సందేహాలు ఉన్నా నివృత్తి చేసుకోవచ్చన్నారు.

**అనంతరం నారాయణ హాస్పిటల్ న్యూరాలజి విభాగాధిపతి డాక్టర్ ఎన్ఎస్ సంపత్ కుమార్ మాట్లాడుతూ**

గతంలో ఎపిలెప్సి గురించి అనేక అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం జరిగిందని, అయితే ఈ సంవత్సరం ఎపిలెప్సీ రోగులకు మానసికంగా ఎలా మద్దతివ్వాలి, మూర్ఛ నుంచి స్వేచ్ఛ ఇవ్వడం, మూర్ఛకే జీవితం పరిమితం కాదు అనే అంశాలపై ప్రతిజ్ఞ చేయడం జరుగుతుందన్నారు. మూర్ఛ గురించి అవగాహన, అపోహలు చికిత్సా పద్దతులు గురించి 24/ఎ సేవలు అందించేందుకు ఈ ప్రత్యేక నంబర్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ సదుపాయాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం నారాయణ హాస్పిటల్ అడిషనల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ హరీష్ రావులపల్లి మాట్లాడుతూ వైద్య రంగంలో రోజు రోజుకిసరికొత్త వైద్య విధానాలు వస్తున్నాయని, అందులో భాగంగానే మూర్ఛ వ్యాధికి కూడా అధునాతన చికిత్సా పద్దతులు అందుబాటులోకి వచ్చాయని, మూర్ఛ వ్యాధికి కేవలం మందుల ద్వారా మాత్రమే చికిత్స అనే భావన ఇప్పటికి చాలా మందిలో ఉందన్నారు. అయితే మందులతో నయం కాని మూర్ఛకు శస్త్ర చికిత్సతో నయమవుతుందని, ఈ సదుపాయం ఆంధ్రప్రదేశ్‌లో ఒక్క నారాయణ హాస్పిటల్లో మాత్రమే అందుబాటులో ఉందన్నారు. భారతదేశంలోనే కాకుండా ప్రపంచంలో మూర్ఛ వ్యాధితో బాధపడే వారు ఎక్కడున్నా ఈ టోల్‌ఫ్రీ నంబర్ ద్వారా సమాచారాన్ని తెలుసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో నారాయణ వైద్య విద్యా సంస్థల కో ఆర్డినేటర్ డాక్టర్ బిజు రవీంద్రన్, ఆపరేషన్స్ హెడ్ డి.రామారావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వివ్వకుమార్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ అరుణ్కాంత్, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వనజకుమారి, హాస్పిటల్ ఏజీఎం ఏసీ శేఖర్‌రెడ్డి, వైద్యులు, వైద్య విద్యార్థులు, నర్సింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వక్ఫ్ బోర్డ్ ఆస్తులను సంరక్షించాలి

**- జాయింట్ కలెక్టర్‌కు వినతి పత్రం అందించిన వైసీపీ నేతలు**



**నెల్లూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త** వక్ఫ్ బోర్డ్ ఆస్తులను సంరక్షించాలని కోరుతూ వైసీపీ జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి, నెల్లూరు రూరల్ ఇంచార్జ్ ఆనం విజయ కుమార్ రెడ్డి, ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, ముస్లిం మైనారిటీ నేతలతో కలిసి నెల్లూరు కలెక్టరేట్‌లో, ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జాయింట్ కలెక్టర్ ఎం వెంకటేశ్వర్లుని కలిసి మెమొరండం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లాలో కోట్ల రూపాయలు విలువచేసే వక్ఫ్ బోర్డ్ ఆస్తులు ఆక్రమణలకు గురి కావడం జరుగుతున్నాయని, తక్షణమే అలాంటి వాటిని గుర్తించి వక్ఫ్ ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని తెలిపారు.

**కాకాని మీడియాతో మాట్లాడుతూ**

కూటమి ప్రభుత్వం వక్ఫ్ బోర్డు ఆస్తులను లాక్కోవాలని చూడడం దుర్మార్గమని, వక్ఫ్ బోర్డు గవర్నమెంట్ ఆస్తి కాదు. ముస్లింలకు సంబంధించిన ఆస్తిని ఆంధ్రప్రదేశ్‌లో ముస్లిం మైనారిటీలకు చెందిన వక్ఫ్ బోర్డు ఆస్తులను ప్రభుత్వం లాగేసుకోవడం అన్యాయం అన్నారు. కూటమి ప్రభుత్వం ప్రశ్నించిన వారిపై కక్షపూరితంగా కేసులు పెడుతుందని కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న వ్యతిరేక విధానాలను, ప్రశ్నించే వారిని అణచివేయాలనే ధోరణిని ఖండిస్తున్నారు. మీరు పెట్టే అక్రమ కేసులకు భయపడను, వెనకడుగు వేయను, ప్రజల గొంతుకనై పోరాడుతా నని కాకాని తెలిపారు.

**పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ**

ఎంతోమంది మైనారిటీలు తమ స్థలాలను స్వచ్ఛందంగా వక్ఫ్ బోర్డుకు విరాళాలుగా అందజేశారని అన్నారు. ఈ ఆస్తుల ద్వారా మైనారిటీలు ఆయా ప్రాంతాల్లో మసీదులు, మద్రాసాలు ఏర్పాటుచేయడమే కాకుండా పేద ముస్లింలకు, సహాయం చేసేందుకు ఈ ఆస్తులను వినియోగిస్తున్న పరిస్థితి అందరూ చూస్తున్నామన్నారు. అటు చూస్తే కూటమి ప్రభుత్వం హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా తిరుమల లడ్డు ప్రసాదాన్ని లోడ్ రోడ్డు మీద లాగి హిందువుల మనోభావాలను దెబ్బతీసిందని అన్నారు. కూటమి ప్రభుత్వంలో వక్ఫ్ బోర్డు ఆస్తులకు ఎక్కడ రక్షణ లేకుండా పోయిందన్నారు. వక్ఫ్ ఆస్తులకు నియమ నిబంధన లేకుండా వాటిని ఎలా అయినా వాడుకోవచ్చు అనే విధంగా ఈ రోజు కూటమి ప్రభుత్వ నేతలు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.

**ఈ సందర్భంగా ఆనం విజయకుమార్ రెడ్డి మాట్లాడుతూ**

ముస్లిం మైనార్టీల ఆకాంక్షలకు వ్యతిరేకంగా వారికి హక్కు కలిగిన వంటి మంగళగిరిలోని ఉన్నటువంటి 71 ఎకరాలని నిబంధనలకు విరుద్ధంగా చట్టపరిది వ్యతిరేకంగా కూటమి ప్రభుత్వం దానిని అన్యాక్రాంతం చేయాలా అనుకోవడం రాష్ట్రవ్యాప్తంగా ముస్లిం సోదర సోదరి అందరూ కూడా ఈ చర్యను వ్యతిరేకిస్తూ మాకు న్యాయం చేయండి అంటూ జిల్లా అధికారుల ద్వారా ఏపీ వర్ఫ్ బోర్డ్‌కి వినతి పత్రం ఇవ్వడం జరిగిందని వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పూర్తి స్థాయిలో రాష్ట్ర వ్యాప్తంగా తమకు హక్కు కలిగినటువంటి స్థలాలు కాపాడుకోవడంలో ముస్లిం మైనారిటీ సోదరులు చేసేటువంటి ఏ ప్రయత్నంలో అయినా సరే వారికి అండగా నిలబడడానికి మా నాయకుడు వై.యస్ జగన్ మోహన్ రెడ్డి, నెల్లూరు జిల్లా సంబంధించి వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ యంత్రాంగం మొత్తం కూడా ముస్లిం మైనారిటీలకు బాసటగా నిలబడి వారితో కలిసి ప్రయాణం చేస్తాం అని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర మైనార్టీ జనరల్ సెక్రెటరీ ఖలీల్ అహ్మద్, జిల్లా మైనార్టీ అధ్యక్షులు షేక్ సిద్దిక్, నగర మైనార్టీ అధ్యక్షులు అబ్దుల్ మస్తాన్ మైనారిటీ నేతలు పాల్గొన్నారు.

## నిర్ణీత గడువులోపు అర్జీల పరిష్కరణ

**- పరిష్కార వేదికకు 422 అర్జీలు**

**- జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల**



**నెల్లూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త** సోమవారం కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ హిమాన్షు శుక్ల, జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు, జిల్లా రెవెన్యూ అధికారి విజయ్ కుమార్, డిఆర్డిఏ పిడి నాగరాజు కుమారి, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ డిడి నాగ శేఖర్, డ్వామా పిడి గంగాభవాని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు అర్జీలను పరిష్కరించాలన్నారు. ప్రధానంగా భూ సమస్యలు, ఇతర రెవెన్యూ అంశాలకు పింఛన్లకు సంబంధించి అర్జీలు ఎక్కువగా వస్తున్నాయని వాటిని పరిష్కరించే దిశగా అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. పరిష్కరించలేని సమస్యను ఎందుకు పరిష్కరించలేకపోతున్నారో అర్జీదారులకు సవివరంగా వివరించాలన్నారు. ప్రజా సమస్య పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను బియాండ్ యస్‌యల్‌ఏ పోకుండా చూడాలని అధికారులకు సూచించారు. కార్యక్రమం సజావుగా సాగేందుకు అన్ని ఏర్పాట్లును జిల్లా అధికారులు చేపట్టారు. వీటిలో సహాయకులతో కూడిన అర్జీ స్వీకరణ కౌంటర్లు, రిసెప్షన్ సదుపాయం, జిల్లా మరియు మండల స్థాయి అధికారుల హాజరు, వికలాంగులకు ప్రత్యేక సదుపాయాలు, తాగునీటి సౌకర్యం, అర్జీల పర్యవేక్షణ, ప్రత్యేక క్యూ లైన్లు తదితర ఏర్పాట్లు చేయడంతపాటు షామ్యానలు వేసి నీడను కల్పించారు. సోమవారం జరిగిన ప్రజాపిర్యాదుల పరిష్కార వేదికలో నూతనంగా ఫిర్యాదుల స్వీకరణ త్వరితగతిన పరిష్కారానికి డివిజనుల వారీగా రెవెన్యూ క్లినిక్ ప్రత్యేక కౌంటర్లను తిక్కన ప్రాంగణంలో ఏర్పాటు చేసి అర్జీల సత్వర పరిష్కారానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లాఅధికారులు పాల్గొన్నారు.

**పరిష్కార వేదికకు 422 అర్జీలు** జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పరిష్కార వేదికకు 422 అర్జీలు వచ్చాయి దీంట్లో రెవెన్యూ 195, పంచాయితీ 17, పోలీస్ శాఖ 26, సర్వే ల్యాండ్ రికార్డ్స్ 19, మునిసిపాలిటీ 50 తదితర శాఖలలో మరిన్ని ఉన్నాయి.

## ఆడపిల్లలపై అన్యాయం జరిగితే ఉపేక్షించేది లేదు

**- అత్యతసరం పరిస్థితి ఎదురైనప్పుడు 112కు కాల్ చేయాల**







**కోవూరు, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :** ఆడపిల్లలపై ఎటువంటి అన్యాయం జరిగినా ఉపేక్షించే పరిస్థితే లేదని ఈ సందర్భంగా కోవూరు ఎమ్మెల్యే ఘాటుగా పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటికే మైనర్ బాలిక మృతికి కారణమైన నిందితులను పోలీస్ శాఖ అరెస్టు చేయడం జరిగిందన్నారు. అటువంటి వారికి చట్టపరంగా కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఇటువంటి చర్యలు పునరావృతం కాకుండా పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. ముఖ్యంగా రాత్రి సమయాల్లో పెట్రోలింగ్ ముమ్మరం చేయాలన్నారు. గుమ్మలదిబ్బ లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో తక్షణమే సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే అధికారుల ను ఆదేశించారు. ఆడపిల్లల భద్రత విషయంలో రాజీ పడే పరిస్థితి లేదన్నారు. ఆడపిల్లలకు ఏదైనా అత్యతసరం పరిస్థితి ఎదురైనప్పుడు 112కు కాల్ చేయాలని సూచించారు. ఆడపిల్లల విషయంలో ఏమైనా అన్యాయం జరిగితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. పెన్నా డెల్టా ఆయకట్టు చైర్మన్ జెట్టి రాజగోపాల్‌రెడ్డి, కోడూరు కమలాకర్‌రెడ్డి, బెజవాడ వంశీకృష్ణారెడ్డి, టీడీపీ జిల్లా కార్యదర్శి వెంకటరమణమ్మ, మండల పార్టీ అధ్యక్షు దు సుధాకర్‌రెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షుడు మల్లారెడ్డి, తాడిపర్తి విజయారెడ్డి, బాల రవి, ఎం.సుధాకర్, సాయిరెడ్డి, మైనార్టీ నేతలు జమీల్, జహంగీర్, ఫిరోజ్, మసూద్, సాధిక్, తదితరులు ఉన్నారు.

## ప్రజల్ని ఇబ్బంది పెడితే చర్యలు తప్పవు

**- ట్రాన్సజెండర్లకు ఏఎస్పీ హెచ్చరిక**

**నెల్లూరు క్రైమ్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:** నెల్లూరు టౌన్‌లోని ట్రాన్స్‌జెండర్స్‌తో జిల్లా యస్.పి అజిత వేజెండ్ల ఆదేశాల మేరకు, నగర ఏఎస్పీ దీక్ష సోమవారం ఉమేష్ చంద్ర సమావేశ మందిరంలో ముఖాముఖి సమావేశం నిర్వహించారు.

**ఏఎస్పీ మాట్లాడుతూ** నెల్లూరు టౌన్‌లో నేరాలకు పాల్పడితే ఎట్టి పరిస్థితుల్లో సహించేది లేదని, చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలతో మమేకమై శాంతియుతంగా జీవించాలని, ప్రజలను ఇబ్బంది పెట్టే ప్రవర్తనకు దూరంగా ఉండాలని సూచించారు. ఎవరితోనూ దౌర్జన్యంగా, దురుసుగా ప్రవర్తించరాదని, బెగ్గింగ్, ఎక్స్టార్షన్, దొంగతనాలకు పూర్తిగా దూరంగా ఉండాలని హితవు పలికారు. టౌన్‌లో డ్రోన్‌లు, సిసికెమెరాల ద్వారా నిరంతర పర్యవేక్షణ కొనసాగుతోందని, ఓపెన్ డ్రింకింగ్ చేయరాదని, గంజా వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. పోలీస్ శాఖకు పూర్తి సహకారం అందించాలని, చట్ట పరిరక్షణలో భాగస్వాములుగా ఉండాలని కోరారు. ట్రాన్స్‌జెండర్స్ వారి వివరాలు, నైపుణ్యాల ఆధారంగా సాధ్యమైనంత వరకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశం నిర్వహించి మంచి మాటలు చెప్పిన ఏఎస్పీకి ట్రాన్స్‌జెండర్స్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు టౌన్ సీఐలు వైవి సోమయ్య, సాంబశివరావు, వేణుగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## తిరుపతి లడ్డును రాజకీయం చేయడం తగదు

**– కోట్లాది మంది భక్తుల విశ్వాసాలతో ఆడుకోవద్దు : వైసిపి నాయకుల హెచ్చరిక**



**మనుబోలు ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :** తిరుమల శ్రీవారి లడ్డు కల్తీ జరిగిందని గత వైసిపి ప్రభుత్వంపై చేస్తున్న ఆరోపణలపై సిబిఐ ఇచ్చిన రిపోర్టును చూడారా అంటు మనుబోలు మండల వైసిపి కన్వీనర్ బొమ్మిరెడ్డి హరిగోపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం వారు మీడియాతో మాట్లాడుతు కోట్లాది మంది భక్తుల విశ్వాసాలతో ముడిపడిన అంశంపై మాట్లాడే ముందు ఒకటి రెండు సార్లు చూసుకోని మాట్లాడాలని టిడిపి శ్రేణులకు హితవు పలికారు. లడ్డు కల్తీ జరిగిందని ఆరోపణలు ఉన్న నెయ్యి ట్యాంకర్లు వచ్చింది కూటమి ప్రభుత్వం హయాంలో సప్లై అయిన నెయ్యి ట్యాంకర్ల నుండి తీసుకున్న శాంపిల్స్‌పై చేసిన పరీక్షల చుట్టునే ఈ కేసు నడుస్తుందని అన్నారు .2019లో బోలే బాబా డైరికి టెక్నికల్ క్వాలిపై పర్మిషన్ ఇచ్చింది చంద్రబాబునాయుడే అని అన్నారు. సిబిఐ ఇచ్చిన రిపోర్టులో ఎలాంటి జంతుకొవ్వు,గోడ్డు మాంసం కొవ్వు,పంది కొవ్వు, ఫిష్ ఆయిల్ ఆనవాళ్ళు లేవని స్పష్టం చేశారన్నారు. సిబిఐ ఇచ్చిన స్టేట్‌మెంట్ దాచిపెట్టి జగన్‌మోహన్‌రెడ్డిపై దుష్ప చారం చేస్తున్నారని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చలేక లడ్డు కల్తీ అని దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు.తిరుమల వెంకన్నతో ఆటలాడు తున్నారు రాబోయే రోజులలో తీవ్ర పరిణా మాలు ఎదుర్కుంటారని వారు హెచ్చరించారు. ఈకార్యక్రమంలో దాసరి బాస్కర్‌గౌడ్ ,కడివేటి చంద్రశేఖర్‌రెడ్డి, ముంగర రవీంద్రరెడ్డి, కడివేటి చంద్రశేఖర్‌రెడ్డి,ముంగర రవీంద్రరెడ్డి, కడివేటి చంద్రశేఖర్‌రెడ్డి, కుడుమల వెంకట రమణయ్యగౌడ్,కోటేశ్వరగౌడ్,దువ్వూరు సుధాకర్‌రెడ్డి,మహేంద్రతులసీరామ్ మాదవ్, కమలాకం రెడ్డి,గుంజిరమేష్, మల్లికార్జున,దయాకర్, పెంచలయ్య,వెంకటరమణయ్య,తదితర నాయకులు పాల్గోన్నారు.

## బకింగ్ హోమ్ కెనాల్‌పై ఆక్రమణలు తొలగించండి



**నెల్లూరు అగ్రికల్చర్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త :** బకింగ్ హోమ్ కెనాల్‌పై ఆక్రమణలు తొలగించి, జల రవాణాకు సహకరించాలని బీజేపీ నమామి గంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన బీజేపీ నేతలతో కలిసి రామలింగాపురం వద్ద ఉన్న నీటి పారుదల శాఖ కార్యాలయంలోడీఈ విజయ్ కుమార్‌రెడ్డికి వినతి పత్రం అందజేసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1973వ సంవత్సం వరకు నెల్లూరు జిల్లాలో జల రవాణా బకింగ్ హోమ్ కెనాల్ ద్వారా జరిగిందన్నారు. 1990 తర్వాత ఆక్వా కల్చర్ రంగ ప్రవేశంతో సముద్రం వద్ద ముఖ ద్వారాలను, వాగులు నదీ ముఖ ద్వారాలను ఆక్రమణ చేశారని, కెనాల్‌పై ఉన్న తొమ్మిది లాకులు శిధిలావస్థకు చేరాయని తెలిపారు. చెప్పలేరు ఉప్పుటేరు కండలేరు వాగుల ముఖ ద్వారాలు పూడ్చి వేశాని వివరించారు. దీంతో 60 అడుగుల కాలువ ఆరడుగులకు తగ్గిందని తెలిపారు. ముత్తుకూరు, చిల్లకూరు మండలాలలో కండలేరు క్రీక్‌ను కృష్ణపట్నం పోర్టు యాజమాన్యం పూడ్చి వేసిందని చెప్పారు. కెనాల్‌పై ఆక్రమణలు తొలగించి భూసేకరణ అవసరం లేకుండా జల రవాణాను పునరుద్దరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు కందికట్ల రాజేశ్వరి, పద్మావతి, కంచర్ల నారాయణ యాదవ్, నరాల సుబ్బారెడ్డి, ప్రభాకర్ యాదవ్, రాధారెడ్డి, కేశవ, టి.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## జనార్ధన్‌రెడ్డి భౌతికకాయాన్ని సందర్శించిన మాజీ మంత్రి కాకాణి



**అనుమసముద్రంపేట, ఫిబ్రవరి9, ప్రభాతవార్త:** ఏఎస్‌పేట మండల సీనియర్ నాయకుడు కాటూరి జనార్ధన్‌రెడ్డి అనారోగ్యంతో ఆదివారం మృతి చెందిన విషయం విదితమే.ఆయన భౌతికకాయాన్ని సోమ వారం చిరమన గ్రామంలోని జనార్ధన్‌రెడ్డి స్వగృ హంలో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సందర్శి ంచి నివాళులర్పించారు. ఆయన కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. కాకాణితోపాటు వైఎస్ ఆర్‌సిపి సీనియర్ నాయకులు అంబవరపు కోటిరెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు , రాజవోలు సొసైటీ చైర్మెన్ కాటంరెడ్డి నర్సింహారెడ్డి, మాజీ ఎంపిటిసి , మైనార్టీ యువ నాయకుడు షేక్ షబ్బీర్‌బాషా , మండ లంలోని పలుపార్టీల నాయకులు ఉన్నారు.

## శివరామకృష్ణ మృతి వ్యక్తిగతంగా తీర్చలేని లోటు
## వెంకటగిరి ఎమ్మెల్యే కురుగోండ్ల రామకృష్ణ



**కండలేరుడ్యాం (రాపూరు) , ఫిబ్రవరి 09 ప్రభాతవార్త :** తిరుపతి పార్లమెంట్ అధికార ప్రతినిధి నువ్వుల శివరామకృష్ణ మృతి వ్యక్తిగ తంగా తనకు, పార్టీకి తీరని లోటు అని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగోండ్ల రామకృష్ణ తెలి పారు. సోమవారం రెండు రోజుల క్రితం అనా రోగ్యంతో మృతి చెందిన నువ్వుల శివరామకృష్ణ కుటుంబసభ్యులను ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామకృష్ణ మాట్లాడుతూ 2009 ఎన్నికల నాటి నుండి తనతో పాటే నడచి ప్రతి పర్యాయం తన గెలుపుకు అవిశ్రాంతంగా కృషి చేసిన శివరామకృష్ణ అనారోగ్యంతో మృతి చెందడం ఎంతో భాదకరమని తెలిపారు. పార్టీకి ఎంతో నమ్మకమైన వ్యక్తి శివరామకృష్ణ అని ఆయన శివరామకృష్ణ సేవలను గుర్తుచేసుకున్నారు. ఈసందర్భంగా ఆయన వారి కుటుంబసభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలియచేశారు. శివరామకృష్ణ కుటుంబానికి వ్యక్తిగతంగా తాను, తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ అండగా వుంటుందని తెలిపారు. ఈయన వెంట రాపూరు సొసైటీ ఆధ్యక్షుడు దందోలు వెంకటేశ్వర రెడ్డి, వెంకటగిరి ఏయంసీ మాజీ చైర్మ ్న పులికల్లు రాజేశ్వర రావు, శివాజీ, తిరుపతి పార్లమెంట్ వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి తిక్కమనేని ప్రసాద్ నాయుడు,తిరుపతి పార్లమెంట్ మైనారిటీ ఉపాధ్యక్షుడు షేక్ ముక్తియార్,మండల ప్రధాన కార్యదర్శి మూరంరెడ్డి మధుసూధన్ రెడ్డి, సహాయ కార్యదర్శి పఠాన్ ఛాన్‌భాషా, మండల ఉపాధ్యాక్షుడు మధు నాయుడు, మైనారిటీ నాయ కుడు ఖాజామోహిద్దీన్, నాయకులు దందోలు బాలకృష్ణా రెడ్డి,కోటేశ్వర రెడ్డి, సమయం ప్రసాద్ ,అంకయ్య,తదితరులున్నారు.

## గ్రామీణాభివృద్ధికి అత్యంత ప్రాదాన్యత...ఎమ్మెల్యే కాకర్ల



**జలదంకి, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త :** కూటమి ప్రభుత్వం గ్రామీణాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని ఉదయగిరి శాసనసభ్యుడు కాకర్ల సురేష్ పేర్కొన్నాడు.జలదంకి మండలం గోపన్నపాళెంలో 50 లక్షల రూపాయలతో నిర్మించిన సిసి రోడ్డు ను ఆయన సోమవారం ప్రారంభించాడు,అలాగే జలదంకి పంచా యతి కమ్మ పాళెంలో 75 లక్షలతో నిర్మించతలపెట్టిన సిసి రోడ్‌కు శంకుస్థాపన చేశారు.ఈసందర్భంగ ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాటా ్లడుతుఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలనునెరవేరుస్తున్నామన్నారు.రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్ర బాబునాయుడు,ఉపముఖ్యమంత్రి పనన్ కళ్యాణ్‌లు సమర్ధ నాయకత్వం, సహకారంతో గ్రామీణాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యాత ఏర్పాడిందన్నారు.ఉదయగిరి నియోజకవర్గంలో గత 30 ఏళ్ళగ సరైన రోడ్ సైకర్యంలేక పల్లె సీమల ప్రజలు ఎన్నో అవస్థలు పడ్డారనివారి కడగండ్లను తీర్చడమే తమ కర్త వ్యమని ఉద్ఘాటించాడు.నాణ్యమైన రోడ్ సౌకర్యాలతోపాటు ఇండ్ల నిర్మాణాలు,భూపంపిణి ఇలా ప్రజా ఉప యోగకరమైన పనులు చేపట్టి సమస్యలు లేని సమాజంకోసం పాటుపడుతామన్నారు.ప్రజాకాంక్ష పాలన చేసి చూపెడతామని అందరి హర్షధ్వానాలమధ్య తెలియజేశాడు.రైతు లు తమ ఉత్పత్తులను మార్కెట్‌కు సుల భంగ తరలించే లభిస్తుందని అన్నారు.ఈవిదమైన పనులతో ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచే ప్రతి ఒక్కటి చేస్తామని స్పష్టంచేశారు.ఈకార్యక్రమంలో మండల పార్టి అధ్యక్షుడు మునగాల తిరుమ లరెడ్డి, సోమశిల ప్రాజెక్ట్ వైస్ చైర్మన్ పులిగుంట మధుమోహన్‌రెడ్డి,సీనియర్ నాయకుడు వంటేరు జయచంద్రారెడ్డి ,పార్టీ మాజి అద్యక్షుడు పూనూరు భాస్కర్‌రెడ్డి జలదంకి సొసైటి చైర్మన్ కరియావుల అప్పల నాయుడు ,మాదిరెడ్డి సుబ్బారెడ్డి,కొల్లా రాదాకృష్ణ,జలదంకి వైస్ ప్రసిడెంట్ కూరపాటిజలదంకి వైస్ ప్రసిడెంట్ కూం పాటి మాలకొండారెడ్డి గంటా అశోక్,చిత్తాబత్తిన మస్తాన్‌రెడ్డి,పంచాయతిరాజ్ డిఇ, తహసిల్‌దార్ శీతా మహా లక్ష్మి,ఎంపిడిఒ బ్రహ్మయ్య,ఎఇపిఆర్ వాణి,అన్ని పంచాయతీల టిడిపి నేతలు తదితరులు పాల్గొన్నారు.

## రైతులు, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయండి



**నెల్లూరు అగ్రికల్చర్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త :** భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా జిల్లా పదాధి కారుల సమావేశం ఆ పార్టీ అధ్యక్షు లు శిఫారెడ్డి వంశీధర్‌రెడ్డి అధ్య క్షతన సోమవారం నిర్వహి ంచారు. నెల్లూరు లోని బీజేపీ జిల్లా ప్రధాన కార్యాల యంలో జరిగిన ఈ సమా వేశంలో జిల్లా అధ్యక్షులు శిఫారెడ్డి వంశీధర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ రైతులు, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనివ్వాలని కోరారు. రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతిపత్రాలు స్వీకరించి వాటి పరిష్కారానికి మండల స్థాయిలో కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో ఈ కార్యక్రమం జరిగేలా చూడాలన్నారు. మండల స్థాయిలో ఏర్పాటు చేసే బీజేపీ జనతా వారధి కమిటీలో కిసాన్ మోర్చా నేతలు, ప్రముఖ పాత్ర పోషించి ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు.

## రెండోవ రోజు ఆర్థిక బకాయిల కొరకు యుటిఎఫ్ పోస్ట్ కార్డు క్యాంపైన్



**చేజర్ల ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :** యుటిఎఫ్ రాష్ట్ర జిల్లా కమిటిల పిలుపు మేరకు ఆదూరుపల్లి క్లస్టర్ ప్రాంతంలోని పాఠశాలల్లో యుటిఎఫ్ నాయకులు పిఆర్‌సి చైర్మన్‌ను నియమించుట,ఆర్థిక బకాయిలు విడుదల ఐఆర్ 20 శాతం ఇచ్చుట సిపిఎస్ రద్దు మెడికల్ బిల్లులు ఆలస్యం మొదలైన డిమాండ్లు సాదన కొరకు పోస్ట్‌కార్డు క్యాంపైన్ ను సోమవారం సాయింత్రం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి నాగినేని రమణయ్య మాట్లాడుతు రాష్ట్ర చరిత్రలో 2014 సంవత్సరంలో అత్యధికంగా 43 శాతం ఫిట్మెంట్ ఇచ్చిన ఘనత చంద్రబాబునాడుది అని తెలిపారు. కాబట్టి 12 వ పిఆర్సిలో కూడా మంచి ఫిట్‌మెంట్ ఇవ్వాలని,అప్పటి వరకు ఐఆర్ 29 శాతం ప్రకటించాలని, డిఏ ఆరియర్స్ చెల్లించాలని కోరారు. 2004 వ సంవత్సరం తరువాత చేరిన ఉద్యోగ ఉపాధ్యాయులకు పెన్షన్ సౌకర్యం లేక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కుంటున్న దృష్ట్యా సిసిఎస్‌నురద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని ప్రవేశపెట్టాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మండల యుటిఎఫ్ ఆడిటర్ పతంగి చిట్టిబాబు, యుటిఎఫ్ సీనియర్ నాయ కులు బెల్లంకొండ వెంకటేశ్వర్లు, మస్తాన్‌బాబు, ఖాదర్‌బాషా, ఉప్పు శ్రీరాములు, ఆర్‌వి శేషమ్మ, గీత, ఉపాధ్యా యని,ఉపాధ్యాయులు పాల్గోన్నారు.

## ప్రాణాలైన అర్పిస్తాం మా భూములు మేము కాపాడుకుంటాం

**ఉదయగిరి, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త :** ఉదయగిరి మండల పరిధిలోని పుల్లాయపల్లి గ్రామంలోని రైతులు సోమవారం ఉదయగిరి హైస్కూల్ గ్రౌండ్ నుండి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ప్రాణాలైన అర్పిస్తాం మా భూములు మేము కాపాడుకుంటాం మా భూములకు హద్దులు చూపాలని ఉప తహసీల్దార్ సాజియాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 100 సర్వే నెంబరు 106 సర్వే నెంబర్లలో 312 ఎకరాలు ఈజేఎఫ్ భూమి పేద రైతులకు ఎస్సీ ఎస్టీలకు 1992లో ఆనాడు 280 మంది పేదలకు భూములు పంపిణీ చేశారు. ఆ భూములు తాలూకా అటవీ శాఖ అధికారులు మా అడవి మా పొలాలు కలిసి ఉన్నాయని ఆనాడు వాళ్లను చెట్లు కొట్టుకొనివ్వకుండా ఆపుదాల చేసి ఉన్నారు. అదే భూములను ప్రభుత్వం ఈనాడు కెమికల్ ఫ్యాక్టరీలకు అప్పచెప్పడం ఎంత వరకు సబబు అని పుల్లాయపల్లి రైతులు ఆందోళన చేపట్టారు. మా భూములు మాకు కావాలని మా భూములకు హద్దులు చూపాలని తదితర డిమాండ్లతో రైతు సంఘం నాయకులు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించడం జరిగింది. అనంతరం వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు మపి ాళా నాయకులు, సీపీఎం నాయకులు, రైతులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## రైల్వే ఉద్యోగి హత్యకేసులో ముద్దాయిలు భార్య, కుమారుడే



**కావలి, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :** కావలి రూరల్ మండలం, రుద్రకోటలో ఇటీవల కలకలం రేపిన రైల్వే ఉద్యోగి ఆరే నాగరాజు(47) దారుణ హత్యకు సంబందించిన కేసును పోలీసులు చేదించారు. కుటుంబ తగాదాలు, ఆస్తి వివాదాలు నేపథ్యంలోనే భార్య కుమారుడు కలసి ఈ హత్యకు పాల్పడినట్లు డిఎస్‌పి శ్రీధర్ వెల్లడించారు. సోమవారం స్థానిక విలేకర్ల సమావేశం డిఎస్‌పి మాట్లాడుతూ మృతుడు నాగరాజుకు భార్య మాధవికి మధ్య మనస్పర్థలు ఉన్నాయన్నారు. దీంతో మాదవి తన ముగ్గురు కుమారులతో కలసి చిన్నగంజంలోని తన పుట్టింటి వద్ద నివసిస్తోంది. నాగరాజు రుద్రకోటలోని ఎస్‌సి కాలనీలోని ఇంటిలో ఒంటరిగ ఉన్నాడని తెలిపారు. పిల్లల చదువులు, పెద్ద కుమారిడి వివాహనం కోసం మాధవి భారీగా అప్పులు కావడం జరిగిందన్నారు. ఉద్యోగిగా ఉన్న నాగరాజు కుటుంబానికి ఎటువంటి ఆర్థిక సాయం చేయకుండా తన ఆదాయాన్ని వ్యక్తిగత విలాసాలకే ఖర్చు చేసేవాడని తెలిపారు. అప్పుల ఒత్తిళ్ళు పెరగడంతో మాదవి పేరు మీద ఉన్న రుద్రకోట ఇంటిని అమ్మి అప్పులు తీర్చాలని భార్య, కుమారుడు నవీన్‌బాబు పలుమార్లు కోరడం జరిగిందన్నారు. నాగరాజు అందుకు నిరాకరించడమే కాకుండా ఆ ఇంటిని తన పేరు మీద మార్చుకునే ప్రయత్నవం చేస్తున్నాడన్నారు. దీంత విసుగు చెందిన మాధవి, నవీన్‌బాబు నాగరాజును అడ్డు తొలగించుకునేందుకు పథకం ప్రకారం రెండో కుమారుడు నవీన్‌బాబు తండ్రితో సఖ్యతగా ఉంటున్నట్లు నటించడం జరిగిందన్నారు. తండ్రి మద్యం మత్తులో ఉన్న సమయంలో పచ్చడి రోలుతో తలపై బలంగా కొట్టి హత్య చేయడం జరిగిందన్నారు. అనంతరం పోలీసులను తప్పుదోవ పట్టించేందుకు మృతదేహంపై మరికొన్ని గాయాలు చేసి అక్కడి నుంచి పరారయినట్లు తెలిపారు. పోలీసులు విచారణలో దొరికిపోతామనే భయంతో నిందుతులు మాధవి, నవీన్‌బాబు, ఇద్దరూ విఆర్‌ఓ ఎదుట లొంగిపోయారని విచారణలో తమ నేరాన్ని అంగీకరించారని తెలిపారు. నింతులను రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ కేసులో కావలి రూరల్ పోలీస్‌స్టేషన్ ఇన్స్‌పెక్టర్ రాజేశ్వరరావు, ఎస్ఐలు బాజీబాబు, తిరుమలరెడ్డి, పోలీస్ సిబ్బంది కీలకపాత్ర పోషించడం జరిగిందన్నారు.

## రాష్ట్ర ఏపీటీఎఫ్ ఉపాధ్యక్షులుగా కావలి వాసి



**కావలి, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :** రాష్ట్ర ఏపీటీఎఫ్ 257కు విజయవాడలోని స్థాయిక్రిష్ణతేజ పంక్షన్‌హాలులో ఎన్నికలు నిర్వహించడం జరిగింది. ఈ ఎన్నికలు ఏకగ్రీవంగా ఒంగోలుకు చెందిన మంజులను రాష్ట్ర అధ్యక్షులుగా గుంటూరుకు చెందిన లింగేశ్వరరావును రాష్ట్ర జనరల్ సెక్రటరీగా కాలికి చెందిన పువ్వాడి వెంకటేశ్వర్లును రాష్ట్ర ఉపాధ్యక్షులుగా కమిటీ సభ్యులు ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్బంగా పువ్వాడి వెంకటేశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నుకున్న సభ్యులకు కమిటీ తరపున కృతజ్ఞతలు తెలిపారు.

## వివాహిత హత్య కేసులో నిందితుడు అరెస్ట్



**నెల్లూరు క్రైమ్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:** మూడు రోజుల కిందట నవాబుపేట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన వివాహిత హత్య కేసులో ముద్దాయిని పోలీ సులు అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధి ంచిన వివరాలను ఉమేష్ చంద్ర సమావేశం మంది రంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నగర ఏఎస్పి దీక్ష వెల్లడించారు. ఆమె తెలిపిన సమాచారం మేరకు స్థానిక తడికల బజార్ సెంటర్‌కు చెందిన బండి జయలక్ష్మి(39) తన భర్తతో విడిపోయి కుమార్తెతో కలిసి ఉంటుంది. తన కుమార్తెను మేనల్లుడైన తలపల కుమార్ ఇచ్చి పెళ్లి చేయాలనే ఉద్దేశంతో అతనిని కూడా ఇంట్లోనే ఉంచుకుంది. ఈ క్రమంలో వారిద్దరి మధ్య అక్రమ సంబంధం ఏర్పడింది. ఇటీవల కుమార్ తల్లి చనిపోవడంతో ఆమె అంత్యక్రియలకు హాజరయ్యేందుకు కుమార్ వెళ్లాలని ప్రయత్నించగా జయలక్ష్మి అడ్డుకుంది. ఆ సమయంలో ఇద్దరు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అప్పటినుంచి తరచూ ఇద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఈ నెల 6వ తేదీ తన పెదనాన్న ఇంటికి వెళ్లి వచ్చిన కుమార్ ను ఎందుకు వెళ్లావని జయలక్ష్మి నిలదీసింది. ఇద్దరి మధ్య తీవ్ర ఘర్షణ చోటుచేసుకుంది. అప్పటికే మద్యం మత్తులో ఉన్న కు మార్ కత్తితో జయలక్ష్మి పై విచక్షణ రహితంగా దాడి చేశాడు. జయలక్ష్మి అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటనపై జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల ఆదేశాల మేరకు, నగర ఏఎస్పి దీక్ష పర్యవేక్షణలో నవాబుపేట సీఐ వేణుగోపాల్ రెడ్డి దర్యాప్తు ప్రారంభించారు.నిందితుడు కోసం గాలింపు చర్యలు చేపడుతుండగా సోమ వారం ప్రశాంతినగర్ సమీపంలో నిందితుడిని పోలీసుల అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో ప్రతిభ ఘన పరిచిన సీఐ వేణుగోపాల్ రెడ్డితో పాటు ఇతర సిబ్బందిని ఏఎస్పీ అభినందించారు.

## స్వయం ఉపాధి నిమిత్తం కుట్టుమిషన్ వితరణ



**కావలి, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :** కావలి పట్టణ నివాసులు రామమూర్తి తండ్రి స్వర్గీయ ఆర్‌కె.ఆర్ముగం జ్ఞాపకార్థం కావలి తు పాన్ నగర్‌లోని సంయుక్త సేవాసంస్థ కార్యాలయంలో కుట్టుశిక్షణ నేర్చుకుంటున్న మహిళల్లో సుప్రజ అనే నిరుపేద మహిళకు సోమవారం స్వయం ఉపాధి నిమిత్తం కుట్టు మిషన్ వితరణ, సంస్థ కార్యాలయంలో చదువుకుంటున్న విద్యార్థులకు అన్నదానం చేయడం జరిగింది. ఈసందర్బంగా దాత రామమూర్తి మాట్లాడుతూ సంయుక్త సేవాసంస్థ కార్యాలయంలో ఉచిత కుట్టుశిక్షణ నేర్చుకుంటున్న నిరుపేద మహిళ సుప్రజ తన తండ్రి జ్ఞాపకార్థంగా స్వయం ఉపాధి కల్పన కోసం కుట్టుమిషన్ వితరణ చేయడం సంతోషంగా ఉంద న్నారు. సంస్థ సీనియర్ సభ్యులు ఎం.అజిత్‌బాబు, ఎంవిఎన్ ప్రసాద్‌రావు మాట్లాడుతూ పెద్దల జ్ఞాప కార్థంగా పేద మహిళలకు స్వయం ఉపాధి కల్పించచం అభినందనీయమని తెలిపారు. ఈ సందర్బంగా నేటి దాతను అభినందించారు. అలాగే వారి తండ్రి ఆర్ముగం ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతున్ని ప్రార్థి స్తూ ఉన్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు సురేంద్ర, కుట్టి శిక్షణ ట్రైనర్ ఆయేషా, శిక్షణ నేర్చుకుంటున్న మహిళలు పాల్గొన్నారు.

## ఎర్రచెరువును దక్కించుకున్న వల్లం ప్రసాద్



**అనంతసాగరం , ఫిబ్రవరి9,ప్రభాతవార్త:** మండలంలోని పడమటికం భం పాడు లోని స్వర్ణ గ్రామ స్వర్ణ వార్డులో సోమవారం డిప్యూటీ ఎంపిడిఒ రామచంద్రయ్య, సర్పంచ్ కత్తి లావణ్య పెంచలయ్య ఆధ్వర్యంలో ఎర్ర చెరువుకు బహిరంగ వేలంపాటం నిర్వహించారు. ఈవేలంపాటలో 5మంది పదివేల రూపాయలు నగదు చెల్లించి పాల్గొనగా 1,41,000రూపాయలకు సోమశిలకు చెందిన వల్లం ప్రసాద్ వేలంపాట పాడి ఎర్రచెరువును దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి పుల్లయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

## తిరుమల లడ్డు కల్తీపై నాయకులను విమర్శించడం తగదు

**మనుబోలు ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :** తిరుమల లడ్డు కల్తీ జరిగిందని టిడిపి మండల అద్యక్షుడు పొన్నూరు రామకృష్ణయ్య ఆరోపించారు. వైసిపి హయాంలో పవిత్రమైన తిరుమలలో పాపం చేశారని విమర్శించారు. ప్రపంచ స్థాయిలో భక్తులకుఎంతో నమ్మకంతో ఉన్న లడ్డులో కల్తీ జరిగిందని ఆరోపించారు. ఈ కల్తీ ప్రపంచంలోని అందరి హిందూవుల మనుభావాలను దెబ్బతీసిందన్నారు. లడ్డులో జంతు సంబందిత నెయ్యితోనే తయారు చేయలేదని వైసిపి వాళ్ళునిరూపించలేకపోయారన్నారు. అందుకోసం జాతీయ మీడియాతో కూడా డెబిట్ జరిగిందని అన్నారు. టెబిట్‌లో ఏమి మాట్లాడలేక మౌనం వహించారని ఎద్దేవ చేశారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన దానిపై మా నాయకులను విమర్శించడం తగదు అని హెచ్చరించారు. లడ్డు కల్తీకి భాద్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈకార్యక్రమంలో టిడపి నాయకులు పచ్చిపాల రామిరెడ్డి, సాని వెంకటరమణయ్య, శివుడు రాజాగౌడ్,తిక్కవరపు శ్రీదర్‌రెడ్డి,మోపూరు ధనుంజయరెడ్డి, వెందోటి బాస్కర్‌రెడ్డి, దండు చంద్రశేఖర్‌రెడ్డి, రాయిపాటి కిరణ్ చల్లా గిరి ప్రసాద్ వినీల్‌రెడ్డి, మణి తదితరులు పాల్గోన్నారు.

## ఎస్ఎంఆర్‌జీఆర్ ఎస్ఎంజీఆర్ వ్యవసాయ కళాశాలలో
## వర్మీ కంపోస్టు యూనిట్ ప్రాంభం



**ఉదయగిరి, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉదయగిరి ఎస్ఎంజీఆర్ వ్యవసాయ కళాశాలలో వర్మీ కంపోస్టు యూనిట్‌ను సోమ వారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్య క్రమంలో సీఈఓ డాక్టర్ జి.కృష్ణారెడ్డి, మేనేజింగ్ డైరక్టర్ డాక్టర్ జి.రఘునాథరెడ్డి, మేనేర్ డాక్టర్ జి.కే.సూర్యకృష్ణ పాల్గొన్నారు. వీరితో పాఠశాల కళాశాల సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రశాంతి, ఇతర బోధన సిబ్బంది డాక్టర్ పి.లావణ్య కుఆరి, డాక్టర్ ఏవీఎస్ దుర్గాప్రసాద్, ఇతర టీచింగ్ అసోసియేట్స్, ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఈఓ డాక్టర్ జి.కృష్ణారెడ్డి మాట్లాడుతూ బీఎస్సీ ఫైనల్ ఇయర్ చదువుతున్న 14 మంది విద్యార్థులు నాలుగు నెలల పాటు ఎంట్రప్రెన్యూర్‌షిప్ ఫ్రోగ్రామ్‌లో శిక్షణ పొందుతూ బయోఫోర్టిఫైడ్ వర్మీకంపోస్టు తయారు చేసి విక్రయించనున్నారని తెలిపారు. అంతే కాకుండా రైతులందరికి ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించి, వర్మీ కంపోస్టు ఎంట్రప్రెన్యూర్‌షిప్‌పై అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం విజయవంతంగా పూర్తి కావడంతో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

## శ్రీవారి లడ్డు పేరుతో కూటమి విషప్రచారం - వైసీపీ తీవ్ర ఖండన



**తోటపల్లి గూడూరు, ఫిబ్రవరి 9,ప్రభాతవార్త :** తోటపల్లి గూడూరులో సోమవారం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఉప్పల శంకరయ్య గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో వైసీపీ రాష్ట్ర సీనియర్ నాయకులు, మాజీ ఏపీ డైరీ చైర్మన్ చిల్లకూరు సుధీర్ రెడ్డి కూటమి ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. శ్రీవారి లడ్డు ప్రసాదం అంశాన్ని రాజకీయ లాభాల కోసం వాడుకుంటూ కూటమి ప్రభుత్వం కావాలనే నకిలీ ఆరోపణలు చేస్తూ విషప్రచారం చేస్తోందని ఆయన మండిపడ్డారు. వైసీపీ రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు కూటమి లేవనెత్తిన కుట్రపూరిత తొమ్మిది ప్రశ్నలకు లిఖితపూర్వకంగా, పూర్తి ఆధారాలతో సమాధానాలు ఇచ్చామని తెలిపారు. లడ్డు కల్తీ వ్యవహారం పూర్తిగా టిడిపి పాలన కాలంలోనే జరిగిందని స్పష్టం చేశారు. 2013 నుంచి 2019 వరకు లడ్డు తయారీకి సంబంధించిన టెండర్లు, కొనుగోలు ప్రక్రియ, ధరల వివరాలను ప్రజల ముందుకు తీసుకొచ్చామని పేర్కొన్నారు. కలియుగ దైవమైన శ్రీ వెంకటేశ్వర స్వామి పవిత్ర ప్రసాదాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవడం అత్యంత నీచమైన చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల విశ్వాసాలతో చెలగాటం ఆడుతున్న కూటమి వైఖరిని వైసీపీ ఎప్పటికీ సహించదని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో వైసీపీ మండల అధ్యక్షులు ఉప్పల శంకరయ్య గౌడ్ మాట్లాడుతూ, శ్రీవారి లడ్డు ప్రసాదంపై రాజకీయాలు చేయడం కూటమి నైతిక పతనానికి నిదర్శనమని విమర్శించారు. వాస్తవాలను ప్రజల ముందుంచడంలో వైసీపీ ఎప్పటికీ వెనుకాడదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఉప్పల స్వర్ణలత, వైసీపీ నేతలు టంగుటూరు పద్మనాభ రెడ్డి, గ్రీవెన్స్ సెల్ అధ్యక్షులు తలమంచి సురేంద్రబాబు, మన్యం చిరంజీవి గౌడ్, కాల్తిరెడ్డి సుబ్బారావు, ఆకుల మధుసూదన్ గౌడ్, నెల్లిపూడి సునీల్ రెడ్డి, తిరుపతయ్య, మణి, మహిళా నేత ఎంబేటి సంధ్యారాణి తదితర వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## పంటకోత ప్రయోగాలు ఖచ్చితత్వంతో నిర్వహించాలి



**తోటపల్లి గూడూరు, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త :** మండల వ్యవసాయ కార్యాలయంలో సోమవారం రబి సీజన్‌కు సంబంధించి పంటకోత ప్రయోగాల నిర్వహణపై వ్యవసాయ సహాయకులకు శిక్షణా కార్యక్రమం నిర్వహి ంచారు. మండల వ్యవసాయ అధికారిణి వి. శిరీషారాణి పర్యవేక్షణలో మండల గణాంకాధికారి రాంప్రసాద్ ప్రయోగాల క్షేత్ర ఎంపిక, నిర్వహణ విధానం, సమాచారాన్ని నిర్దిష్ట నమూనాల్లో దోషరహితంగా నమోదు చేయడం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శిరీషారాణి మాట్లాడుతూ పంటకోత ప్రయోగాలు పంటల బీమా మరియు రాష్ట్ర స్థూల ఉత్పత్తి లెక్కలకు కీలకమని, గణాంక శాఖ మార్గదర్శకాల ప్రకారం అత్యంత శ్రద్ధతో నిర్వహించాలని సూచించారు. మండల డిప్యూటీ తహశీల్దార్ శివయ్య ప్రయోగాలపై తహశీల్దార్ కార్యాలయం పర్యవేక్షణ ఉంటుందని, నివేదికలను సకాలంలో సమర్పించాలని తెలిపారు. ఈ శిక్షణలో మండలంలోని వ్యవసాయ సహాయకులు అందరూ పాల్గొన్నారు.

## విమానాశ్రయ భూముల్లో లబ్ధిదారులకు నష్టపరిహారం ఇవ్వాలి

**కావలి, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :** దామవరం విమానాశ్రయ భూముల్లో నిజమైన లబ్ధిదారులకు నష్టపరిహారం ఇవ్వాలని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు ఎస్.మల్లి పేర్కొన్నారు. సోమవారం స్తానిక ఆర్‌డిఓ కార్యాలయం వద్ద మల్లి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి ఆర్డీఓకు వినతిపత్రం సమర్పించారు. కేంద్ర ప్రభుత్వం దగదర్తి మండలం దామవరంలో విమానాశ్రయానికి భూములు సేకరిస్తుండగా భూ లబ్ధిదారులలో వాస్తవమైన వారికి 279నుంచి 300వరకు ఆ భూములలో 1/1 సర్వేనెంబర్లను లబ్ధిదారులకు నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. అందులోనూ కొన్ని వారసత్వంగా భూములు ఉన్నాయని తెలిపారు. నిజమైన వారసత్వం కలిగిన వారికి నష్టపరిహారం ఇవ్వాలని ఆర్డీఓను కోరడం జరిగిందన్నారు. దీనిపై ఆర్డీఓ తప్పకుండా న్యాయం చేస్తామని నిజమైన లబ్ధిదారులకు నషపరిహారం ఇస్తామని తెలిపినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కౌరగుంట మాజీ సర్పంచ్ ఆనందపాడు, బురిది ఏసురత్నం, సాదు ప్రసాద్; సున్నపుబట్టి నివాసితులు పాల్గొన్నారు.

## కుక్కలు,పందులు,కోతుల బారినుండి ప్రజలను కాపాడండి



**రాపూరు,ఫ్రిభవరి09 ప్రభాతవార్త :** రాపూరు పట్టణంలో పందులు, కుక్కలు, కోతుల బెడద ఎక్కువగా వుందని వాటి బారినుండి ప్రజలను కాపాడాలని రాపూరు మండల కోప్షన్ సయ్యద్, 6వ వార్డు సభ్యురాలు సయ్యద్ అప్సనలు కోరారు. సోమవారం సర్పంచ్ భూపతి జయమ్మ ఆధ్వర్యంలో జరిగిన పంచాయితీ సమావేశంలో సయ్యద్ మాట్లాడుతూ ప్రధానంగా పంచాయితీ అభివృద్ధి 5 ఎళ్ళు పరిపాలనా కాలంలో అభివృద్ధి కేవలం పంచాయితీలో కోన్ని వార్డులకే పరిమితమైనదని ఆయన ఆవేధన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ భూపతి జయమ్మ మాట్లాడుతూ కోతులు,పందులు, కుక్కల సమస్య పరిష్కారానికి త్వరలో చర్యలు చేపడుతామని తెలిపారు. కార్యదర్శి అట్ల బాలకృష్ణా రెడ్డి మాట్లాడుతూ పంచాయితీ పరిధిలోని ప్రజలు సకాలంలో ఇంటి పన్నులు చెల్లించి పంచాయితీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు పంచాయితీ వార్డు సభ్యులు వున్నారు.

## చంద్రబాబు నీచరాజకీయాలు చేయడం తగదు



**కోట, పిభ్రవరి 9 ప్రభాతవార్త :** ప్రతిపక్ష నాయకుడు,మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తప్పు పట్టాలని ఆయనపై బురద చల్లాలనే తప్పుడు ప్రయత్నాలతో సీఎం చంద్రబాబు నాయుడు నీచ రాజకీయాలు చేస్తున్నారని కోట మండల వైకాపా కన్వీనర్ పలగాటి సంపత్‌కుమార్ రెడ్డి ఆరోపించారు.ఆయన సోమవారం తన నివాసంలో విలేకర్లతో మాట్లాడారు.అందులో భాగంగా కలియుగ దైవం శ్రీవేంకటేశ్వరస్వామి కీర్తికి, పవిత్రతకు అపఖ్యాతి కలిగించాలని నిరంతరం అబద్దాలు చెబుతున్నారని మండిపడ్డారు.బాధ్యతాయుత స్థానంలో ఉన్న వారు ఆధారాలతో మాట్లాడాలని భక్తులు, ప్రజల మనోభావాలతో ఆటలాడటం మంచిదికాదని సుప్రీంకోర్టు చీవాట్లు పెట్టి సీట్ వేసిందన్నారు. సీబీఐ తో పాటు రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో కూడిన ఈ సిట్ పెద్ద ఎత్తున పరిశోధన చేసి నెయ్యిలో ఎలాంటి జంతు కొవ్వులు కలవలేదని నివేదిక ఇచ్చిందన్నారు.అయిన కూటమి నాయకులు తప్పుడు ప్రచారం కొనసాగిస్తున్నారని చెప్పారు.జగన్ పై ఉక్రోషంతో చంద్రబాబు నాయుడు హిందువుల మనోభావాలను దెబ్బ తీస్తున్నారని, హిందూ దర్మాన్ని బలిపెట్టే స్దితికి తీసుకొచ్చారని ఆయన విమర్శించారు. అబ్దాదలు చెప్పితే ఏవరిని కూడా ఆ వెంకటేశ్వరస్వామి వదలారని చెప్పారు.

## మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకాన్ని యధాతధంగా అమలు పరచాలి

**- సీపీఐ జిల్లా కార్యదర్శి అరిగెల సాయి**



**నెల్లూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త :** గ్రామీణ పేదల కడుపు కొట్టేందుకు కేంద్ర ప్రభుత్వం పూనుకుందని అందులో భాగంగానే ఉపాధి హామీ పథకంలో అనేక మార్పులకు శ్రీకారం చుట్టిందని సిపిఐ జిల్లా కార్యదర్శి అరిగెల సాయి అన్నారు. గ్రామాలలో పేద మధ్యతరగతి ప్రజల జీవిధానం మెరుగుపడాలని లక్ష్యంతో ఎర్రజెండా పోరాటం కొనసాగిస్తూనే ఉంటుందని, ఈ సందర్భంగా కొనియాడారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగిందని అన్నారు. ఈ చట్టంలోని లోపాలను గుర్తించి, వాటిని సరి చేయాలని డిమాండ్ చేస్తూ భారత కమ్యూనిస్టు పార్టీ వ్యవసాయ కార్మిక సంఘం మహిళా సంఘముల ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో ఈరోజు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలలో ఈ నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగిందని అన్నారు. నెల్లూరులో తొలిత మహాత్మా గాంధీ విగ్రహం వద్ద నుండి ఈ నిరసన ప్రదర్శనగా బయలుదేరి జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్కు వినతిపత్రాన్ని అందజేసి వెంటనే ప్రభుత్వం ఈ పథకాన్ని యధావిధిగా కొనసాగించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు వి రామరాజు మహిళా సంఘం జిల్లా కన్వీనర్ కె వినోదమ్మ, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు జిలాని ఖాన్, బికేయంయు జిల్లా సహాయ కార్యదర్శి దర్గా బాబు, సిపిఐ నెల్లూరు రూరల్ మండలం సహాయ కార్యదర్శి ఆదినారాయణ, సర్వేపల్లి నియోజకవర్గ సిపిఐ కార్యదర్శి ఏడుకొండలు, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి మున్నా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మస్తాన్ షరీఫ్, ఆంధ్రప్రదేశ్ మహిళా సంఘం నెల్లూరు నగర అధ్యక్ష కార్యదర్శులు వనజ, సోఫియా, నెల్లూరు నగర మహిళా సంఘంనాయకు రాళ్ల జ్యోతి, సుహానా, కావలి వ్యవసాయ సంఘం నాయకులు పార్వతమ్మ సిపిఐ నెల్లూరు నగర సమితి నాయకులు రేవంత్ హరయ్య, ఖాదర్ బాషాలతో పాటు నెల్లూరునగర, కావలి, సర్వేపల్లి, నియోజకవర్గాల నుంచి అధిక సంఖ్యలో వ్యవసాయ కార్మికులు సిపిఐ కార్యకర్తలు అదేవిధంగా యువజన విద్యార్థి సంఘాల కార్యకర్తలు అధిక సంఖ్యలో ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు.

## జేవివి ఆధ్వర్యంలో గర్భిణీ స్త్రీలకు భోజనాలు పంపిణీ



**గూడూరు, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త :** గూడూరు జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో టమోటో మర్చంట్ సెల్వం దాతృత్వంలో ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి నందు గర్భిణీ స్త్రీలకు హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ షరీనా ద్వారా భోజనాలు పంపిణీ చేసారు. డాక్టర్ షరీనా మాట్లాడుతూ జెవివి వారు క్రమం తప్పకుండా 13 సంవత్సరాల నుండి మా ఆసుపత్రికి వచ్చే నిరుపేద గర్భిణీ స్త్రీలకు మంచి పౌష్టిక ఆహారం అందిస్తున్నారని వారి సేవలు స్ఫూర్తిదాయకమని జేవివి వారందరికీ మా ఆసుపత్రికి సిబ్బంది తరపున కృతజ్ఞతలు తెలియజేసి సెల్వంని అభినందించారు. జేవివి వారు మంచి సమాజం కోసం ప్రయత్నిస్తారని వారి ఆశయాలను అందరూ పునికి పుచ్చుకొని నడిస్తే మూఢనమ్మకాలను పోగొట్టవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో జేవివి అధ్యక్షుడు వేగూరు రాజేంద్రప్రసాద్, నాగరాజు, చెంచు నారాయణ, పురుషోత్తమ రావు, రామ మోహన్, ప్రభాకర్, సుమన్ రెడ్డి, సుబ్బారావు, రజనీ కాంత్, ఆనంద్, శ్రీనివాసాచారి, వెంకట్, సాయి తదితరులు పాల్గొన్నారు.

## లడ్డు విషయములో అసలు మాట్లాడటం దారుణం



**వెంకటాచలం ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:** కలియుగ వెంకటేశ్వర స్వామి లడ్డు విషయములు కూటమి నాయకులు అసత్య ఆరోపణలు చేయటం దుర్మార్గమని జిల్లా వైసీపీ ఉపాధ్యక్షులు మందల వెంకట శేషయ్య ఆరోపించారు. వెంకటాచలంలోని వైసీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్,లోకేష్ బాబు, తిరుమల లడ్డు ప్రసాదములు జంతువు కొవ్వు మాంసాలు కలిశాయని విషప్రచారం చేయటం చాలా దారుణం అన్నారు. నిజ నిదారణ కమిటీలో జంతువులకు లేదని నిర్ధారణ కావడంతో దానిపై వైసీపీ నాయకులు మాట్లాడుతూ వారిపై అక్రమ కేసులు బలాయించి జైలుకు పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతుందని, ప్రశ్నించడం వారిపై దాడులకు పాల్పడి అక్రమ కేసులు బనాయించిన భయపడే ప్రసక్తే లేదుని ఎదురింటి పోరాడుతామన్నారు. ఈ కార్యక్రమంలో కసుమూరు సర్పంచ్ శివకుమార్ నరసయ్య, వందల పెంచలయ్య హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## సర్వే వేగవంతం చేయాలి



**కోవూరు,ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :** పొదుపు గ్రూపులకు సంబంధించి మహిళల ఆదాయ వివరాలను పూరి స్థాయిలో సర్వే చేసే కార్యక్రమాన్ని సంబంధిత వీవోఏలు వేగవంతం చేసేలా దృష్టి పెట్టాలని ఏపీఎం సుబ్బరాజు అన్నారు. కోవూరులోని సంఘమిత్ర కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం వీవోఏలకు ఈ సర్వే యాప్కు సంబంధించిన వివరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పొదుపు మహిళ లక్షాధికారి కావాలన్న ఆశయంలో ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రతి పొదుపు మహిళ యొక్క ఆదాయ వివరాలను ఈ సర్వేలో నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఈ కారణంగా మహిళ యొక్క స్థితిగతులు నమోదవుతాయని, తద్వారా వారికి అవసరమైన సేవలను అందించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా సీసీలు మురళి, రాజశేఖర్, రాము, శోభలు ఈ యాప్పై శిక్షణ అందించారు.

## క్రిష్ణకుమార్, సంధ్య దంపతులను సత్కరించిన దేవరకొండ



**కావలి, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :** బిట్రగుంట వాస్తవ్యులు వృత్తిరిత్యా అమెరికాలో స్థిరపడి నటువంటి బచ్చు క్రిష్ణకుమార్, సంధ్య దంపతులు కొండ బిట్రగుంట బిలాకూటా క్షేత్రములో వెలసి యున్న శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయానికి అన్నదాన సత్రము ఇటీవలే 6వేల మంది కెపాసిటి కలిగిన కళ్యాణ మండపాన్ని నిర్మించడం జరిగింది. అదే విధంగా దక్షిణగాలిగోపురం నిర్మించడానికి వివిద అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడానికి ముందుకు రావడం జరిగింది. ఈ సందర్భంగా కావలి పట్టణ తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు దేవరకొండ శ్రీనివాస, ఓగిరాల సుధాకర్, బాబురావు, వారి మిత్రబృందం వారిని దశ్శాలవాలతో ఘనంగా సత్కరించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్దిలో ఈ దంపతులు వారివంతుగా ముందుకు రావడం చాలా ఆనందంగా ఉందన్నారు. వారికి ప్రసన్న వెంకటేవ్వరస్వామి ఆశీస్సులు ఎల్లవేలలా ఉండాలని కోరకోవడం జరిగిందన్నారు.

## బీదన మర్యాదపూర్వకంగా కలిసిన మొగిలి కల్లయ్య



**కావలి, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :** తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి ఎమ్మెల్సీ టిడిపి నెల్లూరు పార్లమెంటు అధ్యక్షుడు బీద రవిచంద్ర యాదవ్ని నెల్లూరులోని వారి కార్యాలయం నందు సోమవారం టిడిపి రాష్ట్ర కార్యదర్శి మొగిలి కల్లయ్య మర్యాదపూర్వకంగా కలిసి ఆయనను దుశ్శాలవాతో ఘనంగా సత్కరించడం జరిగింది. అనంతరం కావలి నియోజకవర్గంలోని పలు విషయాలను చర్చించుకోవడం జరిగింది.

## జూడో క్రీడలో డిబిఎస్ కళాశాల విద్యార్థికి ద్వితీయ బహుమతి



**కావలి, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :** జూడో అసోసియేషన్ ఆధ్వర్యంలో డిసెంబర్ 20, 21 తేదీలలో కర్నూలులో రాష్ట్ర స్థాయి జూడో క్రీడలలో కావలి డిబిఎస్ ఇంజనీరింగ్ కళాశాల క్రీడాకారులు పి.కావ్య, వి.శ్రావణిలు పాల్గొనడం జరిగింది. వీరిలో పి.కావ్య 57కేజీల బరువు విభాగంలో రెండవ స్థానం సాధించి బహుమతి అందుకోవడం జరిగిందని నెల్లూరు జూడో అసోసియేషన్ ఆర్గనైజర్ సెక్రటరీ జి.మురళి తెలిపారు. డిబిఎస్ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం జరిగిన కార్యక్రమంలో కళాశాల ఛైర్మెన్ డాక్టర్ దామిశెట్టి బాలసురేష్బాబు, కరస్పాండెంట్ దామిశెట్టి సుదీర్నాయుడు పిల్లలను ఉద్దేశించి మాట్లాడుతూ క్రీడలు శారీరక దృఢత్వానికే కాకుండా మానసిక క్రమశిక్షణకు ఎంతో దోహదపడుతాయని జూడో వంటి యుద్ధ కళలు ఆత్మరక్షనకు చాలా అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టీవి.రావు ఏఓ జి.రమేష్బాబు, డిప్లమా కాలేజ్ ప్రిన్సిపాల్ ఆర్వి.రమణయ్య, దామోదర్రెడ్డి, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ దాసరి శివసాగర్కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్ ఎదుట కదం తొక్కిన గిరిజనులు

**- గిరిజనులకు ద్రోహం చేసిన ప్రభుత్వం కుప్పకూలక తప్పదు - అవసరమైతే డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రులు, ఎంపీల ఇల్లు ముట్టడిస్తాం - ఇకనైనా ఎన్నికల కమిషన్ స్పందించాలి - ప్రభుత్వ తీరుపై నిప్పులు చెరిగిన గిరిజన నేత బాపట్ల వెంకటపతి యానాది**



**నెల్లూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త :** గిరిజనుల హక్కులను కాలరాస్తున్న రాష్ట్ర ప్రభుత్వం కుప్పకూలక తప్పదని గిరిజన నేత బాపట్ల వెంకటపతి యానాది సీనియర్ న్యాయవాది అంబేద్కర్ హెచ్చరించారు. స్థానిక కలెక్టరేట్ ఎదుట గిరిజన సంఘాల ఐక్యవేదిక చేపట్టిన రిలే నిరాహార దీక్షలు పదో రోజు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా సోమవారం కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా గిరిజనులు పెద్ద సంఖ్యలో హాజరై కలెక్టరేట్ ముట్టడిలో కదం తొక్కారు. అనంతరం గిరిజన నేత బాపట్ల వెంకటపతి యానాది ప్రభుత్వ తీరుపై నిప్పులు చెరిగారు. రాష్ట్రంలో గిరిజనులను ఒక పథకం ప్రకారంగా ప్రభుత్వం అణిచివేస్తుందని మండిపట్టారు. దీనికి నెల్లూరు నగరపాలక సంస్థ మేయర్ పై కుట్ర నిదర్శనం అన్నారు. గత పది రోజులుగా గిరిజన సంఘాల ఐక్యవేదిక జిల్లావ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్న ప్రభుత్వం స్పందించకపోవడం దారుణం అన్నారు. గత ఎన్నికల్లో ఓట్ల కోసం ప్రాధేయపడిన పాలకుల కు గిరిజన హక్కులను కాపాడాల్సిన బాధ్యత లేదా అంటూ ఆయన ప్రశ్నించారు. గిరిజన మహిళకు అన్యాయం జరిగితే జిల్లా పెద్దలు నోరు మెదపకపోవడం బాధాకరమన్నారు. ఇకపై చూస్తూ ఊరుకోమని అవసరమైతే డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారాయణ, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డిలను ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. ఎన్నికల కమిషన్ గిరిజనులకు న్యాయం చేయాలని, కార్పొరేషన్ మేయర్ ఎన్నికకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. లేనిపక్షంలో ఎన్ని రోజులైనా రిలే నిరాహార దీక్షలు నిర్వహిస్తామని ప్రభుత్వం గద్దె దిగకపోతే ఆమరణ నిరాహార దీక్షలకు పూనుకుంటాము అని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ ప్రజా సంఘాలు పాల్గొన్నాయి. ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ కమిటీ మెంబర్ మాకాని వెంకటేశ్వర్లు, బత్తెన లక్ష్మణ, శేఖర్, వెర్రిచెంచయ్య, గంధర్ల రమేష్, యాకసిరి మురళి, ఈగ శ్రీనివాసులు, తాళ్ల ఏడుకొండలు, బాపట్ల రామయ్య, చలంచర్ల శ్రీనివాసులు, చౌటూరు శ్రీనివాసులు, ఎందేటి సురేంద్ర, తలపల జవర్ధన్, చేవూరు శ్రీనివాసులు, గిరిజన ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## నవోదయ విద్యాలయంలో ప్రేరణ ఉత్సవ్ కార్యక్రమం



**మర్రిపాడు, ఫిబ్రవరి9, ప్రభాతవార్త:** మర్రిపాడు మండలం కృష్ణాపురంలోని జవహర్నవోదయ విద్యాలయంలో సోమవారం ఉదయం నుండి సాయంత్రం వరకు ప్రేరణ ఉత్సవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మినిస్ట్రీ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ అండ్ లిట్రసీ, మిని స్టర్ ఆఫ్ ఎడ్యుకేషన్, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా జవహర్ నవోదయ విద్యాలయంలో నిర్వహించారు. ఆయా పాఠశాలల స్థాయిలో ముందుగా ఎంపిక కాబడ్డ ఒక బాలిక, ఒక బాలుడు మొత్తం 35మంది విద్యార్థులు జిల్లా స్థాయిలో నిర్వహించిన ఈకార్యక్రమంలో పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో ప్రధానంగా వికసిత్ భారత్, మై కాంట్రిబ్యూషన్ టు నేషన్ , ఆత్మ నిర్భరత్ కార్యక్రమాలు ప్రధాన అంశాలుగా ఉన్నాయి. వ్యాసరచన, కథారచన, చిత్రలేఖనం, గానం అంశాల్లో ఈ పోటీలు నిర్వహించారు. ఈకార్యక్రమానికి మండల విద్యాశాఖాధికారి ఇ.ధనలక్ష్మి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.విద్యార్థులు విద్యార్థి దశనుంచే పోటీ తత్వానిన అలవరచుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో ప్రధాన అంశాలైన స్వాభిమానం, శౌర్యం, సాహసం, పరిశ్రమ, సమర్పణ, కరుణ, సేవ, వివిధత, ఏకత ఈ అంశాలను అలవరచుకోవాలన్నారు.ఈకార్యక్రమంలో జిల్లా నుండి వచ్చిన విద్యార్థిని, విద్యార్థుల్లో ఇద్దరిని ఎంపిక చేసి ప్రధానమంత్రి నరేంద్రమోడి చదివిన గుజరాత్లోని వాద్నగర్కు పంపిస్తామన్నారు. వారు అక్కడ క వారం రోజులు ఈ అంశాలపై శిక్షణ తీసుకొని విలువలతో కూడిన పౌరులుగా ఎదుగుతారన్నారు. విద్యాలయ ఇన్చార్జ్ ప్రిన్స్పాల్ కె.పార్వతి ప్రేరణ ఉత్సవ్ కార్యక్రమాల వివరాలను తెలిపారు. ఈకార్యక్రమంలో కృష్ణా జిల్లా వైస్ప్రిన్స్పాల్ రాజశేఖర్, ఉపాధ్యాయులు మాధవరావు, ప్రసాద్, ఉషాప్రభ, జేమ్స్, లీనా, బాలకృష్ణ, చెన్నయ్య, వెంకటరెడ్డి, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సౌత్ మోపూరులో అభివృద్ధి బాట - సీసీ రోడ్లకు



**నెల్లూరు రూరల్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త :** శ్రీకారంనెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని సౌత్ మోపూరు గ్రామంలో 20 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్లను నెల్లూరు రూరల్ మండల పరిషత్ అధ్యక్షుడు బూడిద విజయ్ కుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల వరకే రాజకీయాలు ఉంటాయని, ఎన్నికలు లేని సమయంలో కూటమి ప్రభుత్వంలో అమలవుతున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరికీ అందే విధంగా కృషి చేస్తున్నామని తెలిపారు. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి గారు నెల్లూరు రూరల్ మండలాన్ని ప్రత్యేకంగా అభివృద్ధి చేస్తున్నారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సౌత్ మోపూరు గ్రామ అభివృద్ధికి 2 కోట్ల 30 లక్షల రూపాయల నిధులు కేటాయించిందని కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి పేర్కొన్నారు. ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి గారి ఆధ్వర్యంలో నెల్లూరు రూరల్ నియోజకవర్గాన్ని ఒక ఆదర్శ నియోజకవర్గంగా నిలిపేందుకు నిరంతరం కృషి జరుగుతోందని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో నెల్లూరు ఏఎంసీ చైర్మన్ మనుబోలు శ్రీధర్ రెడ్డి, క్లస్టర్ ఇంఛార్జ్ జలదంకి సుధాకర్, జెడ్పి కోప్షన్ మెంబర్ అల్లాబక్షు, టీడీపీ మండల కన్వీనర్ పముజుల ప్రదీప్, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయ మండల ఇంఛార్జ్ వేమిరెడ్డి సురేంద్ర రెడ్డి, కో క్లస్టర్ ఇంఛార్జ్ రాపూరు శేఖర్, ఎంపీటీసీ రాపూరు చెంచమ్మ, నీటిసంఘం అధ్యక్షులు తుళ్లూరు రామయ్య, మన్నవరపు సుధాకర్, నీటిసంఘం ఉపాధ్యక్షుడు అశోక్, టీడీపీ నాయకులు మన్నవరపు భాస్కర్, పముజుల సతీష్, బండ్ల గోపాలయ్య, బట్టా కార్తీక్, మన్నవరపు నరసయ్య, వెంకయ్య, అరెద్దుల మణి, పముజుల గోపాలయ్య, రవీంద్ర, పెంచలయ్య, చీమల సుధాకర్, గుంజి రవి, విజయ్ భరత్, వెంకటేశ్వర్లు, చైతన్య, ప్రసన్న, పముజుల మల్లికార్జున, పడవల మురళి, సునీల్, శీనయ్య, వంగపూడి శివయ్య, పముజుల వెంకటేశ్వర్లు, పెంచలయ్య, బి. శీనయ్య, పముజుల వెంకటరమణయ్య, ఉబ్బల పెంచలయ్య, శంకరయ్య, మల్లయ్య, రాపూరు రవి, ఉంటా శివయ్య, ప్రభాకర్, మహేశ్వర్ రెడ్డి, ఉదయాకర్ రెడ్డి, శ్యామయ్య, అంకయ్య, హర్ష, తిరుపాల్ తదితరులు పాల్గొన్నారు.

## క్యాబ్ బుకింగ్ తరహాలో డ్రోన్ సేవలు



**కోవూరు,ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :** వ్యవసాయ శాఖలో క్యాబ్ బుకింగ్ తరహాలో డ్రోన్ సేవలను ప్రవేశపెడుతున్నామని వీటిని రైతులు పూరి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని సహాయ వ్యవసాయ సంచాలకులు జి. అనిత అన్నారు. డ్రోన్ సేవలకు సంబంధించి కోవూరు వ్యవసాయ శాఖ సబ్ డివిజన్ పరిధిలోని ఐదు మండలాల వ్యవసాయధికారులు డ్రోన్ పైలెట్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డ్రోన్ సేవలు అవసరమైన రైతులు ప్లే స్టోర్ నుంచి ఉబరైజేషన్ ఆఫ్ కిసాన్ డ్రోన్స్ అనే మొబైల్ యాప్ను డౌన్లోడ్ చేసుకుని దానిలో రిజిస్టర్ చేసుకోవాలన్నారు. అనంతరం యాప్లో అందుబాటులో ఉన్న డ్రోన్ సర్వీసుల నుంచి వారికి ఆసక్తి ఉన్న డ్రోన్ను రైతులే ఎంపిక చేసుకుని డ్రోన్ సేవలు పొందవచ్చన్నారు. ఈ యాప్ ద్వారా అనేక సేవలు అందించడంతో పాటు సులభంగా పొలానికి అందుబాటులో ఉంటాయన్నారు. తద్వారా రైతులకు సమయం కూలీల ఆదా తగ్గడమే కాకుండా నాణ్యమైన పంటను దిగుబడి చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐదు మండలాల వ్యవసాయాధికారులు ఉన్నారు.

## ఇంటిపన్నుల బకాయిలు వసూలు చేయండి

**బిట్రగుంట ఫిబ్రవరి 9 ప్రభాతవార్త** బోగోలు మండలంలోని అన్ని పంచాయతీలలో 15 నాటికీ నూటికినూరు శాతం ఇంటిపన్నుల బకాయిలు వసూలు చేయాలనీ ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం ఆదేశించారు. ఈ దశలో ప్రక్రియను వేగవంతం చేయాలనీ పంచాయతీ, సచివాలయకార్యదర్శులను అయన ఆదేశించారు. నిర్లక్ష్యం ప్రదర్శించిన సిబ్బంది పైన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు.

## సర్వర్ సమస్య తో యూనిఫైడ్ సర్వే

**బిట్రగుంట ఫిబ్రవరి 9 ప్రభాతవార్త** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టత్మాకంగా చేపట్టిన యూనిఫైడ్ సర్వేకు సర్వర్ సమస్యతో తీవ్ర అవంతరాలు ఎదురవుతున్నాయి. కుటుంబంలో ఎంతమంది సభ్యులు ఉంటే వారివివరాలు సేకరించి యాప్ లో పొందుపరచాలంటే రోజుకి ఒక్కొక్క ఉద్యోగికి రెండు, మూడు ఇండ్లు కూడ పూర్తి కావటం లేదు. దీంతోపాటు రెగ్యులర్ విధులు కూడా నిర్వర్తించాల్సి రావడంతో సచివాలయ సిబ్బంది తలలు పట్టుకొంటున్నారు. ఒక వైపు అధికారులు టార్గెట్లు పెడుతుండటంతో ఇబ్బందులు పడుతున్నారు. సర్వే గడువు మరో 20 రోజుల్లో ముగియనున్నది.

## రైల్వే పిడబ్ల్యుఐ ఉద్యోగి పైన చర్యలు తీసుకోండి

**బిట్రగుంట ఫిబ్రవరి 9 ప్రభాతవార్త** బిట్రగుంట రైల్వే పీడబ్ల్యుఐ కార్యాలయం లో పనిచేసే ట్రాలీమెన్ దేవినేని రమణ పైన చర్యలు తీసుకోవాలని రైల్వే మజ్దూర్ యూనియన్ బిట్రగుంట శాఖ సి హెచ్. వెంకటేశ్వర్లు బిట్రగుంట పోలీస్ లకు పిర్యాదు చేశారు. సదరు ఉద్యోగి మద్యం సేవించి తోటి సహ ఉద్యోగులపైన అనుచితంగా ప్రవర్తిస్తూ మరణాయుధాలు తీసుకోని బెదిరిస్తూ సహఉద్యోగుల పైన సోషల్ మీడియా లో అసబ్యమేస్సేజ్లు పెడుతూ ఇబ్బందులు కు గురిచేస్తున్నారని పిర్యాదు లో పేర్కొన్నారు. తక్షణమే అతనిపైన చర్యలు తీసుకోని సహచర ఉద్యోగులకు రక్షణ కల్పించాలని కోరారు.

## 22న గుంటూరులో బీసీ గర్జన



**నెల్లూరు క్రైమ్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:** బీసీల హక్కుల సాధన కోసం, న్యాయపరమైన సమస్యల పరిష్కారాన్ని కోరుతూ ఈనెల 22న గుంటూరులోని నాగార్జున యూనివర్సిటీ ప్రాంగణంలో బీసీవై పార్టీ ఆధ్వర్యంలో బీసీ గర్జన పేరుతో బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బుధవరపు బాలాజీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికలను స్థానిక జ్యోతిరావు పూలే విగ్రహ కూడలి ప్రాంతంలో బీసీవై పార్టీ నాయకులు కలిసి సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ బీసీ సింహ గర్జన కార్యక్రమానికి బీసీవై పార్టీ జాతీయ అధ్యక్షులు బోడే రామచంద్ర యాదవ్ హాజరవుతున్నట్లు వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా ఉండే బీసీ ఎస్టీ ఎస్సీ మైనారిటీస్ కుటుంబాలను కలిసి బీసీలకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రభుత్వం నుండి బీసీలకు రావాల్సిన వాటాను తెలియజేస్తూ జిల్లాలోని ప్రతి కుటుంబాన్ని కరపత్రాల ద్వారా కలుస్తూ గ్రామ, మండల, పట్టణ స్థాయి సమావేశాలు జరుపుతూ ప్రతి ఒక్కరిని ఈ కార్యక్రమానికి హాజరయ్యే విధంగా కార్యక్రమాన్ని జయప్రదం చేస్తామని అన్నారు. ఈ సింహగర్జన ప్రధానాంశాలు స్థానిక సంస్థల్లో బీసీలకు 44 శాతం రాజకీయ రిజర్వేషన్ ఉండాలని, గత ప్రభుత్వాలు ప్రస్తుత ప్రభుత్వాలు ప్రకటించిన బీసీ కార్పొరేషన్కి నిధులు కేటాయించాలని, బీసీ రక్షణ చట్టాన్ని అమలులోకి తేవాలని, రాజధాని ప్రాంతంలో బీసీలకు భూ కేటాయింపులు చేయాలని ప్రధాన అజెండాగా పేర్కొన్నారు. పిపిసి సభ్యులు ఎస్ఎస్ యాదవ్ మాట్లాడుతూ బీసీలకు రాజకీయంగా ఆర్థికంగా వెనకబడిన వర్గాలను కలుపుకొని కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా పనిచేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పార్టీ ఈసీ మెంబర్ సోమ గోపాల్, బీసీ పార్టీ రాష్ట్ర కో కన్వీనర్ లీలా కృష్ణ యాదవ్, పాపూరు హరినాథ్, కొణిదెల నాగేంద్ర, బొడ్డు రమేష్, సోమా అనురాధ, బీసీ సమన్వయ కమిటీ జిల్లా చైర్మన్ బొమ్మి నాగ కిషోర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో మర్రిపాడు ఉపాధ్యాయుడి ప్రతిభ



**మర్రిపాడు, ఫిబ్రవరి9,ప్రభాతవార్త:** రాష్ట్రస్థాయి ఉపాధ్యాయుల లీప్ క్రికెట్ టోర్నమెంట్లో మర్రిపాడు మండలం చుంచులూరు గ్రామానికి చెందిన మర్రిపాడు ఉన్నతపాఠశాల గణిత ఉపాధ్యాయుడు పోలూరు నాగరాజు అద్భుత ప్రదర్శనతో అలరించాడు. గుంటూరు కెఎల్ యూనివర్శిటీలో ఎన్టీఆర్ జిల్లా జట్టుతో జరిగిన మ్యాచ్లో 44 బంతుల్లో 60పరుగులతో నాటౌట్గా నిలిచి జట్టును విజయపదంలో నడిపించాడు. ఈ మ్యాచ్లో 46పరుగుల తేడాతో నెల్లూరు జిల్లా జట్టు గెలుపొందింది. బ్యాటింగ్తోపాటు కీపింగ్లో కూడా నాగరాజు అద్భుతమైన ప్రతిభ చూపాడు. నాగరాజుకు పలువురు అభినందనలు తెలిపారు.

## రెండు బైకులు ఢీ.. మహిళ మృతి



**కోట, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :** కోట మండలం కేశవరం గ్రామానికి సమీపంలో జీడీ రోడ్డుపై సోమవారం రెండు బైకులు ఢీకొన్న సంఘటనలో సుబ్బమ్మ (42) అనే మహిళ అక్కడికక్కడే మృతిచెందింది. వివరాలిలా ఉన్నాయి. చిట్టమూరు మండలం శ్రీపురానికి చెందిన సుబ్బమ్మ తన మరిది బైక్లో ఎక్కి నెల్లూరుకు వెళుతుండగా, కేశవరం వద్ద వెనుక నుంచి వస్తున్న మరో బైక్ అదుపుతప్పి ఢీకొంది. ఈ సంఘటనలో సుబ్బమ్మకు తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందింది. మృతదేహాన్ని కోట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మంచి చదువుతో ఉన్నత స్థాయికి వెళ్లాలి



**కొడవలూరు,ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:** మండలంలోని గండవరం ప్రాథమిక పాఠశాలను హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ కార్యదర్శి పొట్లూరు శ్రీనివాసులు సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా బాల బాలికలతో శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి మంచిది చదువులు బోధించి ఉన్నత స్థాయికి వెళ్లాలని ఆకాంక్షించారు. విద్యార్థులు తల్లిదండ్రులతోపాటు ఉపాధ్యాయులను గౌరవించాలని ఆయన అన్నారు .అనంతరం బాల బాలికలకు బిస్కెట్లు అందజేశారు. పొట్లూరి విజయలక్ష్మి ్మ, పాఠశాల ప్రధానోపా ధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ని అక్రమ కేసులు బనాయించిన భయపడే ప్రసక్తే లేదుకాకాణి పూజ



**వెంకటాచలం ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్ని అక్రమ కేసులు బనాయించి జైల్లో పడిన భయపడే ప్రసక్తే లేదని ఎదురింటి పోరాడుతామని కాకాణీ పూజిత పేర్కొన్నారు. నెల్లూరు సెంట్రల్ జైలు వద్ద మాజీ మంత్రి విడుదల రజినీతో కలిసి సెంట్రల్ జైల్లో ఉన్న పిన్నిల రామకృష్ణారెడ్డి తో ములకత అయ్యారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో రాక్షస పాలన అవినీతి అక్రమాలకు అంతులేకుండా పోయిందన్నారు ప్రశ్నించే గొంతులపై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపడం ఏమిటని ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్లో శాంతి పద్ధతిలో ఉన్నాయా లేదా అనేది అర్థం కావడం లేదన్నారు. అక్రమ కేసులు బనాయించిన అధికారులపై తిరిగి మూల్యం చెల్లించుకోక తప్పదు అన్నారు.

## అంగన్వాడీ కేంద్రాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలి



**కోవూరు,ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :** పూర్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు విద్యాబుద్ధులు అందిస్తున్న అంగన్వాడీ కేంద్రాలను మరింత ఆదర్శవంతంగా తీర్చిదిద్దేలా అంగన్వాడీ కార్యకర్తలు ఆయాలు ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీవో శారద అన్నారు. కోవూరు మండలం గంగవరం పంచాయతీ శ్రీనివాస గిరిజన కాలనీ, గంగవరం -2లో ఉన్న అంగన్వాడీ కేంద్రాలను సోమవారం ఆమె ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి అంగన్వాడీ కేంద్రంలో విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారంతో పాటు ఆటపాటలతో కూడిన విద్యను అందిస్తున్నామన్నారు. అదేవిధంగా వీడియోల ద్వారా కూడా వారికి అనేక విషయాలపై అవగాహన కల్పించే కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఇటువంటి కేంద్రాలను తల్లిదండ్రులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆమె అంగన్వాడీ కార్యకర్తలకు పలు సూచనలు చేశారు.

## దేవాలయ ప్రాంగణాలు పరిశుభ్రంగా ఉంచేలా చూడాలి



**కోవూరు,ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :** కోవూరులోని గాంధీ పార్కు సెంటర్లో వెలసి ఉన్న పలు దేవాలయ ప్రాంగణాల్లో చెత్తాచెదారాలు నిండి ఉన్నాయని, దీని వలన భక్తులు అనేక ఇబ్బందులు పడుతున్నారని మండల బీజేపీ అధ్యక్షుడు పోలిశెట్టి వెంకటసుబ్బారావు పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఇన్చార్జి ఎంపీడీవో శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుడి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేలా సంబంధిత పంచాయతీ అధికారులు కూడా సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి గాదిరాజు చక్రవర్తి, మాజీ మండలాధ్యక్షుడు ఐ. రఘురామయ్య, జిల్లా ఓబీసీ మోర్చా ప్రదాన కార్యదర్శి జయచంద్ర, కార్యదర్శి డి. శ్రీనివాసులు, కిసాన్ మోర్చా మండలాధ్యక్షుడు ఎన్. రమణారెడ్డి, ఉపాధ్యక్షుడు కె. మురళి, తదితరులు ఉన్నారు.

## వైభవంగా పల్లకి సేవ



**కోవూరు,ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :** కోవూరులోని గాంధీ పార్కు సెంటర్లో వెలసి ఉన్న శ్రీ కామాక్షి సమేత మల్లికార్జున స్వామి దేవస్థానంలో మాఘమాస సోమవారం స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు విశ్వనాథం సుబ్బరామయ్య అభిషేక పూజలను సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. అనంతరం పల్లకి సేవ కార్యక్రమాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ఈ కార్యమ్రకానికి ఉభయకర్తలుగా శివభక్త బృందం వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో మాజీ చైర్మన్ సురేష్, మాజీ ధర్మకర్త మోహన్, సుకుమార్, భక్తులు ఉన్నారు

## కండలేరులో 57.540 టీయంసీల నీటిమట్టం

కండలేరుడ్యాం(రాపూరు),ఫిబ్రవరి 9పభాతవార్త మండలంలోని కండలేరు జళాశయంలో సోమవారం ఉదయానికి 57.540 టీయంసీల నీటిమట్టం నమోదు అయినట్లు కండలేరు ఎఇ అనీల్ కుమార్ తెలిపారు. జళాశయం నుండి హైలెవల్ కెనాల్ ద్వారా 200 క్యూసెక్కులు, లోలెవల్ స్లూయిస్ ద్వారా 200 క్యూసెక్కులు,కండలేరు హెడ్ రెగ్యులేటర్ ద్వారా 1340 క్యూసెక్కుల చొప్పున మొత్తం 1340 క్యూసెక్కుల నీరు అవుట్ ఫ్లోగా వెలుతున్నట్లు ఆయన తెలిపారు.

## బంగారు పతకాలు సాధించిన శ్రీ వివేకానంద ఇంగ్లీషు మీడియం స్కూల్ విద్యార్థులు



**బుచ్చి ఫిబ్రవరి 9 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం మున్సి పాల్టీలోని శ్రీవివేకానంద ఇంగ్లీషు మీడియం విద్యార్థులు రాష్ట్రస్థాయిలో అర్చరీ క్రీడలో బంగారు పతకం సాధించారు. ఈ సందర్భంగా కరస్పాం డెంట్ రామసుబ్బారెడ్డి విద్యార్థులను అభినందిం చారు. అలాటే పిఇటి యశ్వంత్‌ను ఆయన అభి నందించారు. నెల్లూరులోని వివిఆర్ ఫంక్షన్ హాల్ లో జరిగిన రాష్ట్రస్థాయిలో అర్చరీలో బి.భువన్ వరుణ్ తేజ్ ( 7 వతరగతి బి.శ్రీనిది (5వతరగతి ), విద్యార్థులు బంగారు పతాకాలు సాధించారు. అండర్ 14 అర్చరీ నేషనల్ గేమ్స్‌లో బంగారు పతకం సాధించడం ఎంతో ఆనందంగా ఉందని కరస్పాండెంట్ రామ సుబ్బారెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

## బుచ్చి మున్సిపాల్టీ స్టాండింగ్ కౌన్సిల్‌గా న్యాయవాది శ్యామ్ సుందర్



**బుచ్చి ఫిబ్రవరి 9 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం మున్సి పాల్టీ స్టాండింగ్ కౌన్సిల్‌గా న్యాయవాది ముత్యాల శ్యామ్ సుందర్ నియమితులైయ్యారు. ఈ సందర్భంగా ఆయ న స్నేహితులు అభిమానులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా న్యాయవాది శ్యామ్ మాట్లాడుతు తనకు ఇంతటి బాధ్యతలు అప్పగించినందుకు కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి, చైర్‌పర్సన్‌మోర్ల సుప్రజా ము రళీకి , కమిషనర్ డి.బాలకృష్ణకు ఆయన ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

మహాయోగ పౌండేషన్ ,దొడ్లకోదండరామిరెడ్డి నేతృత్వంలో

## గర్భిణిలకు పౌష్టికాహారం పంపిణి



**బుచ్చి ఫిబ్రవరి 9 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం పట్టణం లోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మహాయోగ పౌండేషన్ ,సీనియర్ టిడిపినేత,హస్పటల్ డైరక్టర్ దొడ్ల కోదండరా మి రెడ్డి సోమవారం గర్భిణిలకు పౌష్టికాహారం మల్టివిటమిన్ టా నిక్‌లు పంపిణి చేశారుఈకార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ పద్మజా ,టిడిపి నాయకులు కావలి వెంకటేశ్వర్లు, మీరా పా ల్గోని గర్బిణిలకు పౌష్టికాహారం అందజేశారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతు 9 వ తేది గర్బిణీ స్త్రీలకు పౌష్టికాహారం అందజేయడం అభినందనీయమని అన్నారు. గర్భిణి స్త్రీలు ఆరోగ్యంగా ఉండాలని పౌండేషన్ అధినేత లోకేష్ గర్భిణి మహిళలకు పౌష్టికాహారం అందజే యడం ప్రశంసనీయమని ప్రశంసించారు. గర్భణి స్త్రీలు రక్తహీనతతో బాధపడుతున్న వారికి సీనియర్ టిడిపినేత దొడ్ల కోదండరామిరెడ్డి సహకారంతో ఐరన్ ట్యాబ్లెట్ ఇవ్వడం అభినందనీయమని అన్నారు. సామాజిక ఆరోగ్యకేంద్రంలో ఎన్నో సేవా కార్యక్రమాలను చేపట్టిన కొదండరామిరెడ్డి మహాయాగపౌండేషన్ అధినేత లోకే ష్‌కి వారు ధన్యవాదాలు చెప్పారు. గర్భిణీ స్త్రీలు వైద్యులు సలహాలు సూచనలు తప్పకుండా పాటించాలని సూచించారు. ఎంపి వేమిరెడ్డి ప్రభాక ర్‌రెడ్డి,ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చేస్తున్న సేవా కార్యక్రమం స్పూర్తితో మండలంలోని మరెన్నో సేవా కార్యక్రమాలు చేస్తామని చెప్పారు. కోవూరు నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తు ముందుకు వెళు తున్నారని కొనియాడారు. మహాయోగ పౌండేషన్ సభ్యులు ,వైద్యసిబ్బంది, తదితరులు పాల్గోన్నారు.

## నేడు ఎమ్మెల్యే చేతులు మీదుగా అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ ప్రారంభం



**బుచ్చి ఫిబ్రవరి 9 ప్రభాతవార్త** మున్సి పాల్టీలోని కట్టుబడిపాళెం గ్రామంలోనూతనంగా నిర్మించిన పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ( అర్బన్‌ప్రైమరీహెల్త్ సెంటర్ ) భవనం ఈనెల 10వ తేదిఉదయం 10 గంటలకు కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ప్రారంభించనున్నారు. ఈనేద్యంలో ప్రైమరీ హెల్త్‌సెంటర్‌ను చైర్‌ప ర్సన్ మోర్ల సుప్రజా మురళీ, కమిషనర్ డి.బాలకృష్ణా, పరిశీలించారు. కౌన్సిలర్ రాచూరు సత్యనారాయ ణ,కౌన్సిలర్ నాగరాజు, మైనార్టీనాయకులు పఠాన్ మహబూబాషా, ఏ ఈ వెంకటేష్ పాల్గన్నారు.

## సీఎంతో వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులు

**కోట, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త** జీఎస్‌డీపీ వృద్దిరేటు, స్వర్ణాంధ్ర 2047 విజన్ లక్ష్యాలు,పది సూత్రాల అమలు అధాయార్జన శాఖలు రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడులు, పీపీపీ ప్రాజెక్టుల పురోగతిపై అమరావతి సచి వాలయం నుంచి సీఎం చంద్రబాబు అధికారులతో సమీక్షించారు.కోట మండల తహిశీల్దార్, కె.జయజ య రావు, ఎంపిడివో దిలీప్ కుమూర్‌లు గూడూరులో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. వర్చువల్ విధానంలో జరిగిన కాన్స్ రెన్‌రెన్స్‌లో మంత్రులు, కార్యదర్శులు, కలెక్టర్లు పాల్గొన్నారు.వివిధ వర్గాల ప్రజల తో తరుచుగా మంత్రులు, అధికారులు మాట్లాడుతూ ఉంటే చాల సమస్యలకు పరిష్కారం లభిస్తాయని సీఎం చెప్పారు. ప్రతీ ఐదేళ్లకూ జీఎస్డీపీ తలసరి ఆదాయం, రెట్టింపు అయ్యేలా ప్రణాళికలు చేపట్టాలని సూచిం చారు క్షేత్ర స్ధాయి నుంచి తీసుకునే సమాచారం ఒకటి రెండు సార్లు పరిశీలన చేసుకోవాలన్నారు. గత పాలకులు చేసిన అప్పుల కారణంగా 14 శాతం వడ్డీ చెల్లిస్తున్నామని పేర్కొన్నారు. ఏపీ క్రెడిట్ రేటింగ్ పెం చుకుని వడ్డీ తగ్గించుకునిలా రుణాలు రీ షెడ్యూలు చేస్తున్నామని సీఎం వివరించనట్లు అధికారులు తెలి పారు. 2019..24 మధ్య ఆర్దిక క్రమవిక్షణ దెబ్బ తీశారని .జీతాలు కూడా మొదటి తేదీకి ఇవ్వలేని పరిస్థితి ఉండేదన్నారు. ఇప్పుడు జీతాలు చెల్లింపులు గాడిలో పెట్టామన్నారు. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తున్నామని సీఎం చక్కగా వివరించారని కోట మండల అధికారులు ప్రభాతవార్తకు వివరించారు.

## ఆన్లైన్ సర్వీస్ సెంటర్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే



**కొడవలూరు, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని నూతన ఎస్.వి ఆన్లైన్ సర్వీస్ సెంటర్ ను కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ప్రారంభించారు. సోషల్ మీడియా కన్వీ నర్ కోవూరువెంకీ, లక్ష్మీ జానకి కుటుంబ సభ్యు లు ఎమ్మెల్యేకు పుష్పగుచ్చం అందజేసి,అర్చ కులచే ఘన స్వా గతం పలికారు. ఆన్లైన్ సర్వీస్ సెంటర్లో ప్రజలకు అవసరమయ్యే సేవలను అం దిస్తూ మరి అంత ఉన్నత స్థాయికి వెళ్లాలని ఆకాం క్షించారు .కోడూరు కమలాకర్‌రెడ్డి, మండల ఇన్చార్జి మంగమూరు శ్రీహరిరెడ్డి, మామిడాల మధు, మందిపాటి ప్రవీణ్ కుమార్ రెడ్డి, కోటంరెడ్డి అమరేందర్ రెడ్డి, నక్క రమణయ్య, షేక్ జిలాని భాష, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న ఇంటర్ ప్రయోగపరీక్షలు



**నెల్లూరు,ఫిబ్రవరి9 ప్రభాతవార్త-విద్య** జిల్లాలో జరుగుతున్న ఇంటర్ ప్రయోగ పరీక్షలు సోమ వారం కూడా కొనసాగాయి. ఉదయం జరిగిన ప్రయోగపరీక్షల్లో 1742మంది విద్యార్థులకు హాజ రు కావాల్సి ఉండగా1707 మంది హాజరు అయ్యా రు. 35మంది విద్యార్థులు గైర్హాజరైయ్యారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షల్లో 1588 మంది హాజరు కావాల్సి ఉండగా 1557 మంది హాజరు అయ్యా రు. 31మంది గైర్హాజరైయ్యారు. జిల్లాలో ప్రయోగపరీక్షలు జరుగుతున్న ఐదు కేంద్రాలను ఇంటర్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి టి.వరప్రసాద్‌రావు ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈ సందర్బంగా ఆయన మాట్లా డుతు పరీక్షల నిర్వహణలో అందరూ బోర్డు నిబంధనల మేరకు నడుచుకోవాలని ఆదేశించారు. బోర్డు నియ మాలను ఉల్లంఘించి అవకతవకలకు పాల్పడే కళాశాలల యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయ టం జరుగుతుందని హెచ్చరించారు. ఆర్‌ఐఓ తో పాటూ జిల్లా పరీక్షల కమిటీ సభ్యులు 7 కేంద్రాలను, ఫ్లైయింగ్ స్క్వాడ్‌బృందాలు మరో కేంద్రాలను తనిఖీచేశారు. ఈ తనిఖీల్లో ఆర్‌ఐఓ కార్యాలయ సీనియర్ ఏఓ రాజారెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బైక్ ప్రమాదంలో యువకుడు మృతి



**తోటపల్లి గూడూరు, ఫిబ్రవరి 9,ప్రభాతవార్త** మండలంలోని వరకవిపూడి గ్రా మంలో సాయంత్రం సుమారు 6 గంటల సమయంలో నెలటూరు జెన్కోలో పని చేస్తున్న శివకుమార్ (35) అనే యువకుడు విధులు ముగించుకుని సాలిపేటలోని తన నివా సానికి మోటార్ బైక్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో వరకావిపూడి గ్రామం సమీపంలో ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ను ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. తలకు బలమైన గాయాలు కావడంతో స్థానికులు వెంటనే 108 అంబులెన్స్ ద్వా రా నెల్లూరు అపోలో ఆసుపత్రికి తరలించారు. అయితే అక్కడ చికిత్స పొందుతూ ఆయన మృతి చెందాడు. ఈ విషాదకర ఘటనతో కుటుంబ సభ్యులు, బంధు వులు,గ్రామస్తులుశోకసంద్రంలో మునిగిపోయారు. కాసాల శివకుమార్ తండ్రి వెంకయ్యతో పాటు కుటుంబానికి ఈ సంఘటన తీరని దుఃఖాన్ని మిగిల్చింది. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## క్యాంపస్‌డైవ్‌లో 35మంది ఎంపిక



**కావలి, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :** కావలి ఎంఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో సోమవారం ఏపీఐటిఏ ఆ ధ్వ ర్యం లో ప్రముఖ ఐటి సంస్థ సీఐఎస్ టెక్నాలజీస్ నిర్వ హించిన క్యాంపస్ డ్రైవ్‌లో దాదాపు 80 మంది విద్యార్థులు హాజరయ్యారు. కంపెనీ ప్రతినిధులు నిర్వ హించిన రాత పరీక్ష, టెక్ని కల్ రౌండ్ హెచ్ఆర్ ఇంటర్వ్యూల్లో ఎంపిక ప్రకియల అనంతరం 35మంది ఎంపికయ్యారు. ఎంపికైన విద్యా ర్థులకు నియామకపు పత్రాలు అందజేశారు. కరస్పాండెంట్ గుంటుపల్లి రాజ్‌కుమార్‌చౌదరి మాట్లాడుతూ యువతకు నాణ్యమైన విద్యతోపాటుఉద్యోగావకాశాలు కల్పిం చడమే మా కళాశాల ప్రధాన లక్ష్యమని తెలిపారు. విద్యార్థులకు చదువుతోపాటు క్యాంపస్ డ్రైవ్‌లు నిర్వ హిస్తున్నామని తెలిపారు. ఏపీస్కిల్ దెవల ప్మెంటు కార్పోరేషన్ ఆధ్వర్యంలో 13వ తేదీ కళాశాలలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు .కంపెనీప్రతినిధులు,కళాశాలఅధ్యాపకులు,సిబ్బందివిద్యార్థులు పాల్గొన్నారు.

## 11న రావూస్‌లో టిసిఎస్ ప్రాంగణ ఎంపికలు



**నెల్లూరు,ఫిబ్రవరి9 ప్రభాతవార్త-విద్య** ఈనెల 11న నగరంలోని స్ధానిక విఆర్‌సి సెంట ర్‌లోని తమ డిగ్రీ కళాశాలలో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు టిసిఎస్ సౌజన్యంతో ప్రాంగణ ఎంపికలను నిర్వ హిం చనున్నామని రావూస్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వై.కోటేశ్వరరావు, డైరెక్టర్ వై.శివసంకే త్‌లు తెలిపారు. సోమవారం స్ధానిక కళాశాలలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ ఎంపికలకు తమ కళాశాలలో డిగ్రీ చదువుతున్న విద్యార్థులతోపాటూ ఇతర కళాశాలల్లో 2024,25లల్లో డిగ్రీ పూర్తిచేసి అర్హత కలిగిన అభ్యర్థులు పాల్గొన వచ్చని తెలిపారు. జిల్లాలోని నిరుద్యోగ యువత ఈ అకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. అలాగే ఆంధ్రా రీజియన్‌లో నెల్లూరు క్లస్టర్‌లో ప్రథమంగా ఉన్న తమపై నమ్మకంతో టిసిఎస్ వంటి ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్ద ఉద్యోగుల ఎంపిక కోసం డ్రైవ్‌ను నిర్వహించటం సంతోషంగా ఉందన్నారు. విద్యాసంస్థల సిఈఓ ఎన్.శివారెడ్డి మాట్లాడుతు అన్నీ కార్పోరేట్, ప్రయివేట్ సంస్థలు ఉద్యోగులకు కొరకు ఎంపికలను నిర్వహించుకునేందుకు అవసరమైన అన్నీ సదుపాయాలు తాము కల్పించటం జరిగిందన్నారు. అందరూ ఈ ఎంపికల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. అనంతరం ప్రాంగణ ఎంపికలకు సంబందించిన గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల ప్లేస్‌మెంట్ అధికారి నవీన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మూడు ప్రతిష్టాత్మక జాతీయ పవర్-జెన్ వాటర్ మేనేజ్‌మెంట్ అవార్డులు గెలుచుకున్న ఎస్.ఈ.ఐ.ఎల్ ఎనర్జీ



**ముత్తుకూరు, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త** భారతదేశంలోని అతిపెద్ద స్వతంత్ర విద్యుత్ ఉత్పత్తిదారులలో ఒకటైన ఎస్ఈ ఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్, సిఈఈ 4వ నేషనల్ పవర్ జెన్ వాటర్ మేనేజ్‌మెంట్ అవార్డుల్లో మూడు అగ్ర పురస్కారాలను సాధించినట్లు గర్వంగా ప్రకటిస్తోంది. ఈ అ వార్డులు, థర్మల్ పవర్ రంగంలో స్థిరమైన జల నిర్వహణ, నవీనతకు చేసిన కృషిని గుర్తిస్తూ ప్రధానం చేసారు. బి. శ్రీని వాస్, హెడ్ - ఆపరేషన్స్ సపోర్ట్ అసెట్ పనితీరు, తిరు మురుగన్ కృష్ణన్, మేనేజర్ ఈ అవార్డులను ఢిల్లీలో అందు కున్నారు. ఎస్ఈఐఎల్ ఎనర్జీ కింది విభాగాలలో అవార్డులను అందుకుంది. నేషనల్ వాటర్ ఎఫిషియంట్ ఐపిపి కోల్ ప్లాంట్ ఆఫ్ ది ఇయర్ నేషనల్ ఇన్నోవేటివ్ వాటర్ కన్జర్వేషన్ ఆప్టిమైజేషన్ ప్రాక్టీసెస్ ప్లాంట్ ఆఫ్ ది ఇయర్ నేషనల్ వాటర్ ఎఫిషియంట్ యూనిట్ - కోల్ (1,000 నుండి 1,500 మెగావాట్లు) ఈ సందర్భంగా ఎస్.ఈ.ఐ.ఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ దినివీ జనమేజయ మహాపాత్ర మాట్లాడుతూ ఈ గుర్తింపు మా స్థిరమైన జల నిర్వహణ పద్ధతులు, ఆపరేషనల్ ఎక్సలెన్స్ పర్యావరణ బాధ్యత పట్ల మా బలమైన కట్టుబాటును ప్రతిబింబిస్తుంది. మా ఉద్యోగుల అంకితభావం, క్రమశిక్షణ, జట్టు భావన లేకుండా ఈ విజయాన్ని సాధించడం సాధ్యమయ్యేది కాదు. ఈ విజయంపై మనమందరం గర్వపడుతూ, అన్ని కా ర్యకలాపాల్లో నవీనత, సామర్థ్యం, స్థిరత్వం దిశగా కలిసి ముందుకు సాగుదాం, అని చెప్పారు. నేషనల్ పవర్ జెన్ వాటర్ మేనేజ్‌మెంట్ అవార్డులు, థర్మల్ పవర్ రంగంలో నీటి వినియోగ సామర్థ్యాన్ని మెరు గుపరచడంలో విశిష్ట నాయకత్వాన్ని ప్రదర్శించిన, ఉత్తమ పద్ధతులను అనుసరించిన విద్యుత్ కేంద్రాలను గుర్తించి సత్కరిస్తాయి. విద్యుత్ రంగం కోసం ప్రభావశీలమైన కాన్ఫరెన్సులు, అవార్డ్ ప్రోగ్రామ్‌లను రూపకల్పన చేసి అమలు చేయడంలో దినిని ప్రత్యేక నైపుణ్యం కలిగి ఉంది. పరిశ్రమలో కీలక భాగ స్వాములు, నిర్ణయాధికారులు, నిపుణులను ఒక వేదికపైకి తీసుకురావడంలో ఈ సంస్థ ప్రసిద్ధి చెందింది. బాధ్యతగల విద్యుత్ ఉత్పత్తిదారుగా ఎస్.ఈ.ఐ.ఎల్ ఎనర్జీ తన కార్యకలాపాల కోసం పూర్తిగా సముద్ర జ లాన్నే వినియోగించుకుంటుంది. గ్రీన్‌బెల్ట్ అభివృద్ధి కోసం శుద్ధి చేసిన నీటిని రీసైకిల్ చేస్తుంది. గత దశా బ్దంలో కంపెనీ 12,00,000 కంటే ఎక్కువ మొక్కలను నాటి ఈ ప్రాంతంలో పచ్చదనాన్ని గణనీయంగా పెంచింది.

## సబ్ ట్రెజరీ అధికారి ఘన సన్మానం



**కోవూరు,ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :** కోవూరు సబ్ ట్రెజరీ కార్యాలయంలో ఉప ఖజానా ధికారిగా పనిచేస్తున్న కిరణ్‌కుమార్ ఆది వారం జరిగిన ఏపీఎన్‌జీవో ఎన్నికల్లో రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు సోమవారం ఆయనను ఉప ఖజానా కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. రానున్న రోజుల్లో మరిన్ని ఉన్నత పదవుతు పొందాలని ఈ సందర్బంగా వారు ఆకాంక్షించారు.

## ప్రణాళికాబద్ధమైన ఆలోచనలతో ముందుకు సాగాలి



**కోవూరు,ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :** ఇంజ నీరింగ్ విద్యార్థులు చక్కని ప్రణాళి కా బద్దమైన ఆలోచన విధానంతో దూరదృష్టితో వ్యాపార మెళుకువల్లో దృష్టిపెట్టాలని అ దయార్ ఆనంద గ్రూ ప్ అధినేత శ్రీనివాస్ అన్నారు. కోవూరు మండలం గంగవరం గ్రా మంలోని గీతాంజలి ఇంజనీరింగ్ కళాశా లలో సోమవారం ఐఐసీసీ విభాగం ఆధ్వ ర్యంలో ఎంటర్‌ప్రెన్యూర్ షిప్ అనే అం శంపై ఇంజనీరింగ్ విద్యార్థులకు అవగాహన



కల్పించే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రణా ళికాబద్దమైన ఆలోచనా విధానంతో దూం దృష్టితో ముందుకు సాగినప్పుడే ఏ వ్యాపార సంస్థ అయినా అభివృద్ధిపథంలో ముందుకు పోతుందన్నారు. వ్యాపారంలోని ఆటుపోట్లను సమన్వయంతో, నైపుణ్యంతో అధిగమిస్తే విజ యాలను చేరుకోవచ్చున్నారు . ముఖ్యంగా కస్టమర్లకు అందించే సేవల్లో రాజీ పడకుండా ఉన్నప్పుడు ఆ సంస్థ విజయం దిశగా పురోగ మిస్తుందన్నారు. వ్యాపారవేత్త అరుణ్ మోహన్ మాట్లాడుతూ క్రమశిక్షణాయుతమైన వ్యాపార కలాపాలు, స్థిరమైన నిర్వాహక సామర్థ్యం, ఏకాగ్రత శ్రమించే గుణం ఉంటే వ్యాపార వాణిజ్య రంగాల్లో ముందుకు సాగవచ్చున్నారు. ఉషోదయ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ రవిరెడ్డి మాట్లాడుతూ ఇటువంటి అవగాహన సదస్సుల ద్వారా విద్యార్థుల్లో వ్యవస్థాపక స్ఫూర్తిని స్వావలంభన దిశగా ప్రోత్సహించడం తమ లక్ష్యమన్నారు. ఈ సందర్భంగా వ్యాపారవేత్తలను కళాశాల యాజమాన్యం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి ఎన్. సుధాకర్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి శ్రీనివాసు లురెడ్డి, కోశాధికారి విజయశంకర్‌రెడ్డి, డైరెక్టర్ డాక్టర్ జి. సుబ్బారావు, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రావణ్‌కుమార్‌రెడ్డి, విభాగాధిపతులు, డీన్‌లు, అధ్యాపకులు ఉన్నారు.

## క్యాన్సర్ వైద్యశాలకు 3 లక్షల విరాళం అందించిన దాతలు



**నెల్లూరు, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త -వైద్యం** నెల్లూరులో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వ ర్యంలో నడు స్తున్న క్యాన్సర్ వైద్యశాలకు పలువురు దాతలు ముందుకొచ్చి తమ దాతృత్వాన్ని చా టుకుంటున్నారు నగరంలోని పొదలకూరు రోడ్డులో ఉన్న వైద్యశాలకు సోమవారం విచ్చేసి పేదలుగా ఉన్న క్యాన్సర్ రోగులకు మెరుగైన వైద్యం అందిం చాల న్న దృక్పథంతో విరాళం అందజేశారు. నెల్లూరు జిల్లాకు చెందిన డాక్టర్ ఎస్ సి సుబ్రహ్మణ్యం,ఎస్ విజయలక్ష్మి మ్మ 3 లక్షల విరాళం అందజేశారు .ఈ విరాళాన్ని క్యాన్సర్ వైద్య శాల చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ టి లక్ష్మి మ్మ , మెడికల్ సూపరిండెంట్ డా క్టర్ ఎం . నాగేశ్వరరావుకు ఈ విరాళాన్ని చెక్కు రూపంలో అందజేశారు. క్యాన్సర్ హాస్పి టల్ వైద్యులు సిబ్బంది విరాళం అందజేసిన దాతలు సుబ్రహ్మణ్యం, విజయలక్ష్మి మ్మకి తమ కృతజ్ఞతలు తెలియజేశారు

## గుమ్మలదిబ్బలో బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ



**కోవూరు,ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :** కోవూరు పంచాయతీ పరిధి లోని గుమ్మ లదిబ్బ కొత్త కాలనీలో మైనర్ బాలిక మృతిచెందిన బాధిత కుటుంబాన్ని సోమవారం ఎమ్మెల్యే పరామర్శించారు. ఈ సందర్బంగా ఆమె మా ట్లాడుతూ ఇటు వంటి సంఘటనలు జరగడం దుర దృష్టకరమ న్నారు. బాధిత కుటుంబా నికి తమ ప్రత్యేక సానుభూతి తెలియ జేస్తున్నామన్నారు. ప్రభుత్వం తరపున తాము కూడా వ్యక్తిగతంలో బాధిత కు టుంబానికి అండగా ఉంటామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. పెన్నా డెల్టా ఆయకట్టు చైర్మన్ జెట్టి రాజగోపాల్‌రెడ్డి, కోడూరుకమలాకర్‌రెడ్డి, బెజవాడ వంశీకృ ష్ణారెడ్డి, టీడీపీ జిల్లా కార్యదర్శి వెంక టరమణమ్మ, మండల పార్టీఅధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, పట్టణపార్టీ అధ్య క్షుడు మల్లారెడ్డి, తాడిపర్తి విజ యారెడ్డి, బాల రవి, ఎం. సుధాకర్, సాయిరెడ్డి, మైనార్టీ నేతలు జమీల్, జహంగీర్, ఫిరోజ్, మసూద్, సాధిక్, ఉన్నారు.

## కిమ్స్ హాస్పిటల్‌లో అంతర్జాతీయ మూర్ఛ వ్యాధి దినోత్సవంపై అవగాహన కార్యక్రమం



**నెల్లూరు, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త -వైద్యం** అంత ర్జాతీయ మూర్ఛ వ్యాధి దినోత్సవాన్ని పురస్క రించుకుని ప్రజల్లో మూర్ఛ వ్యాధిపై అవగాహన పెం చే లక్ష్యంతో ప్రత్యేక అవ గాహన కార్యక్రమాన్ని కిమ్స్ హాస్పిటల్ నెల్లూరు నందు విజయవంతంగా నిర్వహించారు. ఎపిలెప్సీ ఒక నాడీ సంబంధిత వ్యాధి. ఈ వ్యాధి గురించి ప్రజల్లో అవగాహన పెం చడం, అపోహలను తొలగించడం, బాధితులకు సమాజం గురించి మద్దతు అందేలా చేయడం లక్ష్యంగా ఈ అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో వైద్యులు ఎపిలెప్సీ లక్షణాలు, చికిత్స విధానాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివ రించారు. ఎపిలెప్సీ ఉన్న వ్యక్తులు సరైన వైద్య చికిత్స ,మందులతో సాధారణ జీవితం గడపగలరని తెలియ జేశారు. మూర్ఛ వచ్చినప్పుడు భయపడకుండా బాధితుడిని సురక్షితంగా పక్కకు తిప్పి, తలకు గాయాలు కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. నోటిలో, చేతిలో ఏ వస్తువులు పెట్టకూడదు, వెంటనే వైద్యులను సంప్రదించాలి అని సూచించారు. ఈ కార్యక్రమాన్ని చిన్న నాటకంలా వేసి ప్రజలకు అవగాహన కల్పించారు. సమాజంలో ఎపిలెప్సీ పై ఉన్న అపోహలను తొలగించి, బాధితులను వివక్ష లేకుండా ఆదరించాలని కోరారు. ఎపిలెప్సీ చికిత్స చేయగల వ్యాధి అని, ప్రజలు తెలుసుకోవడం చాలా అవసరం, ఈ వ్యాధికిఅవసరమైన అన్ని చికిత్సలు అందు బాటులో ఉన్నాయని తెలియజేశారు. ప్రజలందరూ ఎపిలెప్సీ పై అవగాహన పెంపొం దించుకొని ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి సహకరించాలని కిమ్స్ హాస్పిటల్ వైద్యులు కోరుతున్నారు. ఈ సందర్భంగా సీనియర్ న్యూరో సర్జన్ డాక్టర్ సి.కృష్ణ మోహన్, న్యూరో ఫిజిషియన్ డాక్టర్ వి.అభిన యరెడ్డి, న్యూరో ఫిజిషియన్ డాక్టర్ జి.సంఘమిత్ర, చీఫ్ కార్డియాలజిస్ట్ డాక్టర్ సీఎస్ శ్రీనివాస్ రాజు, చీఫ్ అనస్థిషియాలజిస్ట్ డాక్టర్ శేషయ్య, అనస్థీషియాలజిస్ట్ డాక్టర్ నరేష్ కుమార్, సీనియర్ మైక్రో బయాలజిస్ట్ డాక్టర్ దీప్తి, నియోనాటాలజిస్ట్ డాక్టర్ ఆర్.భార్గవ్, పీడియాట్రిషన్ డాక్టర్ ఆర్.మురార్జి, హెచ్‌ఓడీ ఎమర్జెన్సీ డాక్టర్ వి.శివరామకృష్ణారెడ్డి, ప్లాస్టిక్ సర్జన్ డాక్టర్ బి.వన్య, డెర్మటాలజిస్ట్ అండ్ కాస్మెటాలజిస్ట్ డాక్టర్ షేక్ గులాబీ, యూనిట్ హెడ్ అండ్ చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.సతీష్ కుమార్, మెడికల్ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీధర్‌రెడ్డి వైద్య నిపుణులు మాట్లాడుతూ మూర్ఛ వ్యాధిని సరైన చికిత్సతో పూర్తిగా నయం చేయవచ్చని తెలిపారు. వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే సమీప వైద్య కేంద్రా న్ని సంప్రదించాలని సూచించారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో మూర్ఛ వ్యాధికి పరీక్షలు, చికిత్సలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా పోస్టర్ల ప్రదర్శన, కరపత్రాల పంపిణీ, ప్రజలతో ప్రత్యక్ష సంభాషణ నిర్వహించారు. పెద్ద సంఖ్యలో ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొని అవగాహన పొందారు. ఈ అవగాహన కార్యక్రమం ప్రజల్లో సానుకూల స్పందనను పొందిందని, మూర్ఛ వ్యాధి నివారణలో ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని కిమ్స్ వైద్యులు, మేనేజ్‌మెంట్ తెలిపారు.

## ఉచిత నేత్ర వైద్య సేవలు పేద ప్రజలకు వరం



**వింజమూరు, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త** నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వీపీఆర్ నేత్ర పేద ప్రజలకు వరంలా నిలుస్తుందని మండల తెలుగుదేశం పార్టీ కన్వీనర్ గూడా నర్సారెడ్డి పేర్కొన్నారు. సోమవారం వింజమూరు పంచాయతీ పరిధిలోని నడిమూరులో వీపీఆర్ ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి మండల తెలుగుదేశం పార్టీ నేతలు కన్వీనర్ గూడా నర్సారెడ్డి సీనియర్ నాయకులు వనిపెంట వెంకట సుబ్బారెడ్డి, సొసైటీ డైరెక్టర్ కోడూరు నాగిరెడ్డి మండల తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు మంచాల శ్రీనివాసులు నాయుడు, యువ నాయకుడు గణపం సుదర్శన్‌రెడ్డి హాజరై ఉచిత వీపీఆర్ కంటి వైద్య శిబిరంను అవసరమైన వారు సద్వినియోగపరుచుకోవాలని వారు కోరారు. వేమిరెడ్డి దంపతులు పేదల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తున్నారని, ఆర్థికత స్థోమత లేని వారికి కార్పొరేట్ వైద్య సేవలు అందించాలని లక్ష్యంతో అనేక వైద్య ఆరోగ్య సేవలను ఉచితంగా అందిస్తున్నారు. అందులో భాగంగా నియోజకవర్గంలోని అన్ని మండలాల పేద వర్గాలకు చెందిన కంటి రోగులను గుర్తించి వారికి వెలుగును ప్రసాదించాలని ఉద్దేశంతో ఈ కార్యక్రమాలను చేపట్టారని తెలిపారు. ఎంతో గొప్ప మనసుతో ఇంతటి కార్యక్రమాన్ని చేపట్టడం ఈ నియోజకవర్గ ప్రజల అదృష్టంగా భావించాలన్నారు. కంటి చూపు కరువైతే ఎలాంటి దృశ్యాలను కూడా మనం చూడలేము అని తెలిపారు. కావున ఇలాంటి కార్యక్రమాలను చేపట్టి కంటి చూపును ప్రసాదించే వారికి మనం ఎల్లవేళలా వెన్నంటి ఉండాలని వారు తెలిపారు. ఈ ఉచిత నేత్ర శిబిరంకు సుమారు 420 మంది కంటి రోగులు హాజరు కాగా వారిని పరీక్షించి సుమారు 190 మందికి కళ్ళజోళ్ళను అందజేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ మాజీ డైరెక్టర్ కర్ణ శ్రీనివాసులు నాయుడు, ఉదయగిరి నియోజకవర్గ వాణిజ్య విభాగ తెలుగుదేశం పార్టీ నాయకులు కటకం ప్రసన్న కుమార్, యువ నాయకుడు తిరుపత ఆచారి, చేజర్ల భాస్కర్‌రెడ్డి, ఏగినేని శ్రీనివాసన్ నాయుడు, బీజేపీ మండల అధ్యక్షులు ఈశ్వర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు మద్దూరు రాజగోపాల్‌రెడ్డి, ఇతర నాయకులు తదితరులు ఉన్నారు.

## చేజర్ల గ్రీవెన్స్‌లో బిజెపి నేతల వినతి



**చేజర్ల ఫిబ్రవరి 9 ప్రభాతవార్త** బిజెపి రాష్ట్ర జిల్లా నాయకుల పిలుపు మేరకు ప్రతి సోమవారం నిర్వ హించే జనతా వారధి కార్యక్రమంలో భాగంగా మం డలకేంద్రమైన చేజర్లలలో ఎంపిడిఓ అమర్‌కు సోమ వారం వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భం గా వినతిలో చేజర్ల ఎంపిడిఓ కార్యాలయం ఆవర ణంలో రైతులు గతంలో ధాన్యం ఆరబెట్టుకొని ధా న్యం కొనుగోలు కేంద్రాలకు తరలించే వారిని ఇప్పుడు సిసి రోడ్లు వేయడంతో కొంతభాగంగా సమానంగా లేకపోవడం వల్ల రైతులు ఇబ్బందులు గురు వుతున్నారని తెలిపారు. సమానంగా లేని భూమిని గ్రావిల్ తోలిచదనుగా వేయడం వల్ల రైతులు ఎలాటి ఇబ్బందులు గురికాకుండా ఉంటారని తెలిపారు. మడపల్లి గ్రామంలో వర్షాకాలంలో వర్షపు నీరు గ్రామంలోకి రావడంతో గ్రామస్తులు అందరు తీవ్రఇబ్బందులు గురై అనారోగ్యం పాలువుతున్నారని తెలియజేశారు. వర్షపునీరు గ్రామంలోకి రాకుండా అధికారులు చర్యలు చేపట్టాలని తెలిపారు. బిజెపి మండల పార్టీ అధ్యక్షులు గుండాల విజయబాస్కర్‌రెడ్డి,బిజెపి జిల్లా ఉపాధ్యాక్షులు బత్తల కృష్ణయ్య, కుండా శివారెడ్డి, తదితర బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## కావలి నియోజకవర్గంలో పలు సమస్యలను పరిష్కరించాలి



**కావలి, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :**కావలి నియోజక వర్గంలోని పలు సమస్యలను పరిష్కరించాలని బిజె పి ఒకటో పట్టణ అధ్యక్షులు మంద కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో జనతా వారధి కార్యక్రమాన్ని నిర్వహిం చడం జరిగింది. ఈసందర్బంగా సోమవారం కావలి ఆర్డీఓ సన్నీ వంశీక్రిష్ణను కలసి పట్టణ, నియోజకవర్గ పరిధిలోని ప్రధాన సమస్యలపై వినతిపత్రాన్ని అందజేయడం జరిగింది. ఈ సందర్బంగా నాయకులు మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారులకు వెంటనే టిడ్కో గృహాలను అందించాలని పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేయడం జరిగింది. ముసునూరు 14,15 వార్డులలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, అమృత్ పథకం కింద నిర్మించిన ట్యాంకులను వెంటనే అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. నియోజకవర్గంలో జరుగుతున్న అక్రమ గ్రావెల్ మైనింగ్ నిబంధనలకు విరుద్ధంగా చేస్తున్న లేఅవుట్లపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలను మోసం చేస్తున్న వారిపై విచారణ జరపాలని కోరారు. కొండ బిట్రగుంట బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా రోడ్లు మరమ్మత్తులు చేపట్టాలని ఇతర సౌకర్యాలను అధికారులు పర్యవేక్షించాలని కోరారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుండ్లపల్లి భరత్‌కుమార్, జిల్లా టెలికం అడ్వైజరీ కమిటీ సభ్యులు కుట్టుబోయిన బ్రహ్మానందం, బోగోలు మండల అధ్యక్షులు వీరాల శ్రీనివాసులు, బిజెపి నాయకులు అర్జీదారులు పాల్గొన్నారు.

## లోవోల్టేజ్ సమస్యకు చెక్.. రూ.41.33 లక్షలతో నూతన ట్రాన్స్‌ఫార్మర్ల ప్రారంభం



**నెల్లూరు రూరల్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త :** రూరల్ నియోజకవర్గ పరిధిలోని 32, 33, 34వ డివిజన్లలో రూ.41 లక్షల 33 వేల వ్యయంతో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను స్థానిక కార్పొరేటర్లు తాళ్లూరు అవినాష్, కరణం మం జుల ప్రారంభించారు. టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి పాల్గొన్నా రు. ప్రజాబాట కార్యక్రమంలో భాగంగా ఈ ప్రాంతాలకు వచ్చిన సందర్భంగా స్థాని కులు ఎదుర్కొంటున్న లోవోల్టేజ్ సమస్యను నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి దృష్టికి తీసు కురాగా, ఆయన వెంటనే స్పందించి అధికారులతో చర్చలు జరిపారు. ఫలితంగా నియోజకవర్గంలో లోవోల్టేజ్ సమస్య ఉన్న ప్రాంతాల్లో శాశ్వత పరిష్కారంగా రూ.1 కోటి 40 లక్షల వ్యయంతో 14 నూతన విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లను ఏర్పాటు చేయడం జరిగిందని టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు ఆశీస్సులతో, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి నాయకత్వంలో నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో వందల కోట్ల రూపాయల నిధులతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండింటినీ రెండు కళ్లలా భావించి ప్రభుత్వం ముందుకు సాగుతోందని, గతంలో ఎన్నడూ లేనివిధంగా నియోజకవర్గంలో అభివృద్ధి కొనసాగుతోందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు సహకారంతో నెల్లూరు రూరల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి గారికి ప్రజల ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి ఆకాంక్షి ంచారు. ఈ కార్యక్ర మంలో నెల్లూరు ఏఎంసీ చైర్మన్ మనుబోలు శ్రీధర్ రెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జీలు, కోక్లస్టర్ ఇన్‌చార్జీలు, డివిజన్ అధ్యక్షులు, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.